


PRAJA PRASHNA
# ప్రజాప్రశ్న
RNI : TELTEL/2021/80267
తెలుగు దినపత్రిక
సంపుటి: 5 సంచిక: 307, పేజీలు - 08
ఆదివారం, ఏప్రిల్ 26, 2026 వెల: 5 రూ/.






# కవిత కొత్త పార్టీ.. "తెలంగాణ రాష్ట్ర సేన"






- టీఆర్ఎస్ పేరుతో కొత్త పార్టీని ప్రకటించిన కవిత
- బీఆర్ఎస్ తెలంగాణ ఆత్మను కోల్పోయిందన్న ఆరోపణ
- కేసీఆర్ మారిపోయారని, ఆయన మన మనిషి కాదంటూ తీవ్ర విమర్శలు
- సామాజిక తెలంగాణే లక్ష్యమని, రెండేళ్లలో అధికారంలోకి వస్తామని ధీమా
- తప్పకుండా తెలంగాణకు ముఖ్యమంత్రిని అవుతానని స్పష్టం చేసిన కవిత

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణలో మరో కొత్త పార్టీ పురుడు పోసుకుంది. తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత కొత్త పార్టీని ప్రకటించారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా మునీరాబాద్‌లోని అద్వయ కన్వెన్షన్‌లో ఏర్పాటు చేసిన సభలో కవిత కొత్త పార్టీ పేరు , జెండాను ఆవిష్కరించారు. కొత్త పార్టీ పేరు తెలంగాణ రాష్ట్ర సేన (టీఆర్ఎస్) అని ప్రకటించారు. పసుపు, ఆకుపచ్చ, నీలం రంగుతో కూడిన జెండాను ఆవిష్కరించారు. మధ్యలో తెలంగాణ మ్యాప్, దానిపై టీఆర్ఎస్ అనే అక్షరాలతో పార్టీ జెండాను రూపొందించారు. అనంతరం ప్రసంగించిన కవిత పార్టీ ఏర్పాటుకు దారితీసిన అంశాలను వెల్లడించారు. తెలంగాణ ఆత్మను బీఆర్ఎస్ కోల్పోవటంతోనే తాను తెలంగాణ రాష్ట్ర సేన ఏర్పాటు చేసినట్లు తెలిపారు.'ఇది నా జీవితంలో మర్చిపోలేని రోజు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం కోసం ఎంతో మంది ప్రాణాలు కోల్పోయారు. తెలంగాణ వచ్చి 12 ఏళ్లైనా మన కలలు పూర్తిగా నెరవేరలేదు. ఉద్యమ నేత కేసీఆర్ గారి అభివృద్ధి రథం గాడి తప్పింది. గతంలో కొన్ని తప్పులు జరిగాయి. ఆ తప్పుల్లో నేనూ భాగంగా ఉన్నా. తప్పుకి ఇప్పుడు క్షమాపణ చెబుతున్నా. తప్పును సరిదిద్దుకునే ప్రయత్నం చేస్తున్నా. బీఆర్ఎస్ తెలంగాణ ఆత్మను కోల్పోయింది. అందుకే తెలంగాణ రాష్ట్ర సేన వచ్చింది. నేను తెలంగాణలోని మూడున్నర కోట్ల మందికి అమ్మగా పరిణితి చెందాలని అనుకుంటున్నా. అమ్మతనంతో పరిపాలన జరిగినప్పుడే రాష్ట్రం ముందుకుపోతుంది. ప్రజల కష్టాలు తీరుతాయి.సామాజిక తెలంగాణే లక్ష్యంగా

2లో..

### కేసీఆర్ ఇప్పుడు మనిషి కాదు.. మర మనిషి

తన తండ్రి కేసీఆర్ ను ఉద్దేశించి కవిత ఘాటు వ్యాఖ్యలు చేశారు "కేసీఆర్ గారు ఇప్పుడు మన మనిషి కాదు ఆయనో మరమనిషి. ప్రజలకు ఏ కష్టమొచ్చినా ఆయన బయటకు రారు. తెలంగాణ ఆత్మను బీఆర్ఎస్ పూర్తిగా కోల్పోయింది" అని కవిత అన్నారు. ప్రజలకు ఏ చిన్ని కష్టం వచ్చినా ఆనాటి కేసీఆర్ బయటకు వచ్చేవారని... ఈనాటి కేసీఆర్ ప్రజల కష్టాలను పట్టించుకోవడం లేదని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. గతంలో చేనేత కార్మికులు ఎన్నో సమస్యలను ఎదుర్కొంటున్న సమయంలో వారి కోసం కేసీఆర్ జోలె పట్టిన సందర్భాన్ని కవిత ఈ సందర్భంగా గుర్తు చేశారు.

### టీఆర్ఎస్ పాంచజన్యం

- ఉచిత విద్య - ఉచిత వైద్యం - రైతే రాజు - 4 లక్షల ఉద్యోగాలు- సామాజిక తెలంగాణ

### బీజేపీ ఎంపీలకు కవిత సవాల్

తెలంగాణ రాష్ట్ర సేన పార్టీ చీఫ్ కల్వకుంట్ల కవిత పార్టీ ఆవిర్భావ సభలో రాష్ట్ర బీజేపీ నేతలకు సవాల్ విసిరారు. రాష్ట్ర విభజన సందర్భంగా ఏపీలో కలిపిన ఐదు గ్రామాలను తిరిగి తీసుకువచ్చే దమ్ముందా అని ప్రశ్నించారు. కేంద్రంలో మీ పార్టీ అధికారంలో ఉంది, ఆ ఐదు గ్రామాలను తిరిగి తీసుకురాలేరా అని ప్రశ్నించారు. మీరు తెలంగాణ బిడ్డలైతే భద్రాచలం వద్ద ఐదు గ్రామాలు తెలంగాణకు పట్టుకురావాలని బీజేపీ ఎంపీలకు సవాల్ విసిరారు కవిత.

## మోదీ, మమత ఇద్దరూ ఒక్కటే

- వారు ధనవంతులకే సాయం చేస్తారన్న రాహుల్ గాంధీ



ప్రధాని నరేంద్రమోదీ, బంగాల్ సీఎం మమతాబెనర్జీపై తీవ్ర ఆరోపణలు చేశారు. మోదీ, మమత ఇద్దరూ ఒకటేనని, వారు ధనవంతులకే సాయం చేస్తున్నారని రాహుల్ విమర్శించారు. వారికి అధికారమే ముఖ్యమని, పేదల సమస్యలు పట్టించుకోరని ఆరోపించారు.

కోల్కతా (ప్రశ్న న్యూస్) దేశంలో రెండు సిద్ధాంతాల మధ్య పోరాటం జరుగుతోందని లోక్‌సభలో విపక్ష నేత రాహుల్‌గాంధీ వ్యాఖ్యానించారు. ఒకవైపు కాంగ్రెస్ ఐకమత్యం, సోదరభావం ఉంటే, మరోవైపు బీజేపీ విద్వేషం ఉందన్నారు. బంగాల్‌లోని హూగ్లీ జిల్లాలో రాహుల్‌గాంధీ రెండోవిడత ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా

#### - మోదీ ప్రజల్లో భయాన్ని పెంచుతున్నారు!

మరోవైపు, ప్రధాని మోదీపై రాహుల్ గాంధీ తీవ్ర స్థాయిలో ఆరోపణలు చేశారు. ఓ వైపు తాను దేశభక్తుడినని మోదీ చెప్పుకుంటున్నా, వాస్తవానికి ఆయన దేశాన్ని అమ్మేస్తున్నారని రాహుల్ వ్యాఖ్యానించారు. ప్రధాని ఎక్కడికి వెళ్లినా ప్రజల్లో భయం, ద్వేషాన్ని పెంచుతున్నారని దుయ్యబట్టారు.

2లో..

## బిజినెస్ రిఫార్మర్ ఆఫ్ ది ఇయర్‌గా చంద్రబాబు

- ఆర్థిక మంత్రి చేతుల మీదుగా అవార్డు స్వీకరణ

ముంబై / అమరావతి (ప్రశ్న న్యూస్) ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మరో ప్రతిష్ఠత్మక పురస్కారం అందుకున్నారు. ఎకనామిక్ టైమ్స్ 'బిజినెస్ రిఫార్మర్ ఆఫ్ ది ఇయర్' అవార్డును చంద్రబాబు అందుకున్నారు. ముంబయిలో జరిగిన కార్యక్రమంలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ చేతుల మీదుగా సీఎం చంద్రబాబు ఈ పురస్కారం అందుకున్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో వ్యాపార అనుకూల వాతావరణాన్ని మెరుగుపరిచి, రాష్ట్రానికి పెద్దఎత్తున పెట్టుబడులను ఆకర్షించినందుకు గానూ 2025 ఏడాదికి సంబంధించి బిజినెస్ రిఫార్మర్ ఆఫ్ ది ఇయర్ అవార్డును చంద్రబాబు అందుకున్నారు. 2025 డిసెంబర్ నెలలో సునీల్ భారతి మిట్టల్, సజ్జన్ జిందాల్, ఉదయ్ కోటక్, డాక్టర్ దేవి శెట్టి, అభిషేక్ మను సింఘ్వీ, నోయల్ టాటాలతో కూడిన జ్యూరీ ఈ ప్రతిష్టాత్మక అవార్డుకు చంద్రబాబును ఎంపిక చేయగా శనివారం ముంబైలో జరిగిన కార్యక్రమంలో చంద్రబాబు అవార్డును స్వీకరించారు. ఈ అవార్డును గతంలో అశ్విని వైష్ణవ్ (2024), ఎస్. జైశంకర్

2లో..




## కేఏ పాల్ కూడా ప్రజాశాంతి పార్టీ పెట్టిండు

- కవిత పార్టీపై బీజేపీ అధ్యక్షుడు స్పందన



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ రాజకీయ తెరపై మరో నూతన పార్టీ ఆవిష్కృతమైంది. ప్రతిపక్ష భారత్ రాష్ట్ర సమితి అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కుమార్తె, ఆ పార్టీ మాజీ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఈ పార్టీని నెలకొల్పారు. ఈ పార్టీపై అప్పుడే విమర్శలు మొదలయ్యాయి. తొలుత భారత్ రాష్ట్ర సమితి సెటైర్లు సంధించింది. టీఆర్ఎస్ ను డూప్లికేట్ పార్టీగా అభివర్ణించింది. ఒరిజినల్ ఒరిజినలేనని, డూప్లికేట్ డూప్లికేటేనని చురకలు అంటించింది. బీఆర్ఎస్ కు చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు

2లో..

## శ్రీహరికోటకు విక్రం-1 ఆర్బిటల్ రాకెట్

- జెండా ఊపి ప్రారంభించిన సీఎం రేవంత్

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) ప్రముఖ ఎరోస్పేస్ సంస్థ స్కైరూట్ అత్యంత ప్రతిష్టాత్మకంగా రూపొందించిన విక్రం-1 ఆర్బిటల్ రాకెట్‌ను తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. హైదరాబాద్ నుంచి అంతరిక్షం పేరుతో స్కైరూట్ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి శ్రీధర్‌బాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మంత్రి శ్రీధర్ బాబు, స్కైరూట్ సంస్థ ప్రతినిధుల సమక్షంలో శ్రీహరికోటలోని సతీష్ ధావన్ అంతరిక్ష కేంద్రంలో ఉన్న ప్రయోగశాలకు తరలించే విక్రం-1 రాకెట్‌ను జెండా ఊపి ప్రారంభించారు. హైదరాబాద్ మామిడిపల్లిలోని జీఎంఆర్ ఏరోస్పేస్ -

2లో..




## ఎమ్మెల్సీలుగా కోదండరాం, అజారుద్దీన్

- ఎమ్మెల్సీ అభ్యర్థిత్వాలకు గవర్నర్ ఆమోదం



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ రాష్ట్ర కేబినెట్ నామినేట్ చేసిన ఇద్దరు ఎమ్మెల్సీల అభ్యర్థిత్వాలకు గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా ఆమోదం తెలిపారు. దీంతో ప్రొఫెసర్ కోదండరామ్, మంత్రి అజారుద్దీన్ ఎమ్మెల్సీలుగా బాధ్యతలు చేపట్టేందుకు మార్గం సుగమమైంది. గత ఏడాది ఆగస్టు 30న పంపిన ఈ ఫైల్ గవర్నర్ వద్ద పెండింగ్‌లో ఉండటంతో ప్రభుత్వంలో తీవ్ర ఉత్కంఠ నెలకొంది. అయితే సీఎం రేవంత్ రెడ్డి స్వయంగా లోక్ భవన్‌కు వెళ్లి గవర్నర్‌తో చర్చలు జరపడంతో ఈ ప్రతిష్టంభనకు తెరపడింది.

ముఖ్యంగా ఏ సభలోనూ సభ్యుడిగా లేకుండానే గతేడాది నవంబర్‌లో మంత్రిగా అజారుద్దీన్ ప్రమాణ స్వీకారం చేశారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో నవీన్ యాదవ్‌కు కాంగ్రెస్ ఎమ్మెల్యే టికెట్ ఇవ్వటంతో అక్కడ టికెట్ ఆశించిన అజారుద్దీన్‌కు ఏకంగా మంత్రి పదవి ఆఫర్ చేశారు. రాజ్యాంగ నిబంధనల ప్రకారం ఆరు నెలలలోపు అంటే ఏప్రిల్ 30 లోగా ఏదైనా ఒక సభకు ఆయన ప్రాతినిధ్యం

2లో..

## తెలంగాణలో భారీగా ఐఏఎస్ అధికారుల బదిలీలు

- 13 మందికి స్థానచలనం




హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ ప్రభుత్వం రాష్ట్ర పరిపాలనలో కీలక మార్పులు చేపట్టింది. ఈ మేరకు భారీ స్థాయిలో 13 మంది ఐఏఎస్ అధికారులను బదిలీ చేస్తూ శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. హైదరాబాద్ జిల్లా కలెక్టర్‌గా పనిచేస్తున్న దాసరి హరిచందన సహా పలువురు సీనియర్ అధికారులు, జిల్లా కలెక్టర్లకు కొత్త బాధ్యతలు అప్పగించింది. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు గవర్నర్ పేరుతో ఈ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా ఉన్న సీనియర్ ఐఏఎస్ అధికారి సంజయ్ కుమార్ (1995 బ్యాచ్)ను ఢిల్లీలోని తెలంగాణ భవన్ స్పెషల్ ఆఫీసర్‌గా బదిలీ చేశారు.

కార్మిక, ఉపాధి కల్పన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా ఉన్న ఎం. దాన కిషోర్ (1996 బ్యాచ్)ను సంజయ్ కుమార్ స్థానంలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా నియమించారు. గవర్నర్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా దాన కిశోర్ పూర్తి అదనపు బాధ్యతల్లో కొనసాగుతారు. ఈ బదిలీల్లో హైదరాబాద్ కలెక్టర్ దాసరి హరిచందన

2లో..

### అమరావతి నగరం నిర్మించే అవకాశం దక్కడం నా అదృష్టం

- ముంబైలో సీఎం చంద్రబాబు

2లో..



## ఒరిజినల్ ఎప్పటికీ ఒరిజినలే

- కవిత కొత్త టీఆర్ఎస్‌పై బీఆర్ఎస్ సెటైర్!




హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణలో మరో కొత్త రాజకీయ పార్టీ ఆవిర్భవించిన నేపథ్యంలో ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత తన పార్టీకి 'తెలంగాణ రాష్ట్ర సేన (టీఆర్ఎస్)' అని పేరు పెట్టడంపై బీఆర్ఎస్ పార్టీ వ్యంగ్యంగా స్పందించింది. ఈ మేరకు బీఆర్ఎస్ తన అధికారిక ఎక్స్ (ట్విట్టర్) ఖాతాలో ఓ సెటైరికల్ పోస్టు పెట్టింది. కోల్‌గేట్ టూత్‌పేస్ట్, బిస్లేరీ వాటర్ బాటిల్‌కు సంబంధించి ఒరిజినల్, నకిలీ ఉత్పత్తుల ఫొటోలను పక్కపక్కనే జోడించింది. దీనికి "ఒరిజినల్ ఎప్పటికీ ఒరిజినలే!" అనే క్యాప్షన్‌ను జత చేసింది. కవిత తన పార్టీకి టీఆర్ఎస్ అని పేరు పెట్టుకున్నప్పటికీ, తామే అసలైన పార్టీ

2లో..

# మోదీ, మమత ఇద్దరూ ఒక్కటే

మణిపుర్లో వ్యవహరించిన రీతిలోనే వారు రాష్ట్రపాలన సాగించాలని అనుకుంటున్నారని మండిపడ్డారు. వారు ఒక మతాన్ని మరొక మతంతో, అలాగే, ఒక భాషను మరొక భాషతో పోరాడేలా రెచ్చగొడతారని ఆరోపించారు. ఇదిలా ఉండగా, కొన్ని సంవత్సరాల క్రితం నిర్వహించిన భారత్ జోడో యాత్ర గురించి కూడా రాహుల్ ప్రస్తావించారు. "కొన్ని సంవత్సరాల క్రితం, కాంగ్రెస్ పార్టీ కన్యాకుమారి నుంచి కశ్మీర్ వరకు 'భారత్ జోడో యాత్ర'ను నిర్వహించింది. అందులో లక్షలాది మంది ప్రజలు పాల్గొన్నారు. అయితే, ఆ యాత్ర ఒక సాధారణ సందేశాన్ని అందించింది. బీజేపీ 'నఫ్రత్ కీ బజార్'ను తెరిస్తే, కాంగ్రెస్ 'మొహబత్ కీ దుకాన్'ను తెరవాలనుకుంటోంది. ఇదే మా సిద్ధాంతం. ఈ సిద్ధాంతం ద్వారానే దేశానికి స్వాతంత్ర్యం లభించింది, రాజ్యాంగం ఏర్పడింది, జాతి బలోపేతమైంది. నరేంద్ర మోదీ పెద్ద పెద్ద వాగ్దానాలు చేస్తారు, కానీ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆయన్ను పూర్తిగా నియంత్రిస్తారు. నాపై 36 కేసులు ఎందుకు ఉన్నాయో మీకు తెలుసా? ఎందుకంటే, నేను నిరంతరం, మోదీ, ఆర్ఎస్ఎస్లకు వ్యతిరేకంగా పోరాడతాను కాబట్టి. కానీ, తృణమూల్ నాయకులు శారదా చిట్ఫండ్ కుంభకోణానికి పాల్పడ్డారు. ఈ విషయం బంగాల్ ప్రజలందరికీ తెలుసు. కానీ, మమతపై మోదీ, ఆర్ఎస్ఎస్ ఎటువంటి విచారణ జరపదు. ఎందుకంటే వారి అసలైన పోరాటం తృణమూల్తో కాదు. వారి పోరాటమంతా కాంగ్రెస్ పార్టీతోనే" అని రాహుల్ గాంధీ ఆరోపించారు.

### - వారి పాలనలో పరిశ్రమలు నాశనమయ్యాయి!

ఇదిలా ఉండగా, దేశ ఆర్థిక వ్యవస్థపై కూడా రాహుల్ గాంధీ ఆందోళన వ్యక్తం చేశారు. నోట్ల రద్దు నిర్ణయం, వస్తు సేవల పన్ను (జీఎస్టీ) అమలు తీరుతో చిన్న పరిశ్రమలు తీవ్రంగా నష్టపోయాయని ఆరోపించారు. ఈ నిర్ణయాలు సరైన విధంగా అమలు కాలేదని, వ్యాపార వర్గాలపై భారాన్ని మోపాయని ఆరోపించారు. అలాగే, ఒకప్పుడు పరిశ్రమల కేంద్రంగా నిలిచిన బంగాల్, ప్రస్తుతం ఆ స్థాయిని కోల్పోయిందని వ్యాఖ్యానించారు. మొదట లెఫ్ట్ ఫ్రంట్, ఆ తరువాత తృణమూల్ కాంగ్రెస్ పాలనలో రాష్ట్రంలో పరిశ్రమలు పూర్తిగా దెబ్బతిన్నాయని విమర్శించారు. అలాగే, ఉద్యోగాల సృష్టిలో కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వం విఫలమయ్యాయని రాహుల్ ఆరోపించారు. యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడంలో సరైన చర్యలు తీసుకోలేదని మండిపడ్డారు.

# బిజినెస్ రిఫార్మర్ ఆఫ్ ది ఇయర్గా చంద్రబాబు

(2023), నిర్మలా సీతారామన్ (2021), దేవేంద్ర ఫడ్నవిస్ (2019), అరుణ్ జైట్లీ (2017), పీయూష్ గోయల్ (2015) అందుకున్నారు. మరోవైపు ఎకనమిక్ టైమ్స్ అవార్డుల కార్యక్రమంలో భాగంగా సీఎం చంద్రబాబు ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో పెట్టుబడులకు అనుకూలమైన వాతావరణాన్ని కల్పించటం, స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్, పారిశ్రామిక విధానాల్లో విప్లవాత్మక మార్పులు, పారిశ్రామిక అనుకూల పాలసీలు తీసుకురావడంలో చంద్రబాబు పోషిస్తున్న పాత్రను ఎకనామిక్ టైమ్స్ జ్యూరీ ప్రశంసించింది. ఈ సందర్భంగా మాట్లాడిన సీఎం చంద్రబాబు నాయుడు పలు కీలక విషయాలను వెల్లడించారు. ఏప్రిల్ 28న విశాఖలో గూగుల్ డేటా సెంటర్ నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నట్లు ప్రకటించారు. గూగుల్ సంస్థ విశాఖలో 15 బిలియన్ డాలర్ల పెట్టుబడి పెడుతోందన్న చంద్రబాబు 28న విశాఖలో గూగుల్కు శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు. దేశంలో 500 గిగావాట్ల గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తి చేయాలని ప్రధాని మోదీ లక్ష్యం విధిస్తే, అందులో ఏపీనే 160 గిగావాట్ల ఉత్పత్తి లక్ష్యాన్ని పెట్టుకుందని తెలిపారు. ఇప్పటికే 90 గిగావాట్ల గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తి దిశగా ముందడుగు వేసినట్లు వివరించారు. దేశవ్యాప్తంగా అధ్యయనం చేసిన తర్వాతనే గతంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో సంస్కరణలు అమలుచేశామన్న చంద్రబాబు.. విజన్ 2020 మూలంగానే హైదరాబాద్ ఇప్పుడు అభివృద్ధి ఫలాలు అనుభవిస్తోందన్నారు. మారుతున్న సాంకేతికతను అందిపుచ్చుకుని దేశం ముందడుగు వేయాల్సిన అవసరం ఉందన్నారు.

# కేఏ పాల్ కూడా ప్రజాశాంతి పార్టీ పెట్టిండు

ఈ టీఆర్ఎస్ ను వైఎస్ షర్మిల గతంలో నెలకొల్పిన వైఎస్ఆర్టీపీతో పోల్చుతున్నారు. టీఆర్ఎస్ కూడా ఏదో ఒక పార్టీలో విలనమౌతుందనీ జోస్యం చెబుతున్నారు.కవిత పార్టీపై బీజేపీ తెలంగాణ రాష్ట్రశాఖ అధ్యక్షుడు ఎన్ రాంచందర్ రావు స్పందించారు. టీఆర్ఎస్ ను లైట్ గా తీసుకున్నారు. టీఆర్ఎస్ ను కేఏ పాల్ కు చెందిన ప్రజాశాంతి పార్టీతో పోల్చారు. కేఏ పాల్ కూడా పార్టీ పెట్టారని, ఆయన ఏం సాధించారని వ్యాఖ్యానించారు. టీఆర్ఎస్ కూడా అంతేనని పేర్కొన్నారు. ఏ పార్టీ నిజంగా తమ గురించి ఆలోచిస్తుందో, సమాజ శ్రేయస్సు కోసం పని చేస్తుందో ప్రజలే నిర్ణయిస్తారని స్పష్టం చేశారు. గతంలో టీఆర్ఎస్ ఇప్పుడు బీఆర్ఎస్ పుట్టబోయే బిడ్డ పేరు మళ్లీ టీఆర్ఎస్ అంటూ రాంచందర్ రావు సెటైర్లు వేశారు. ఎన్ని పార్టీలు వచ్చినా బీజేపీకి ఇబ్బంది లేదని, తెలంగాణలో తామే అధికారంలోకి వస్తామని ధీమా వ్యక్తం చేశారు. టీఆర్ఎస్ పై నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్ మాట్లాడారు. అసలు కవితను తామెప్పుడో మర్చిపోయామని, ఇక ఆమె పెట్టిన పార్టీ గురించి ఆలోచించట్లేదని అన్నారు. మొన్నటి వరకు తెలంగాణ రాజకీయాల్లో పిట్టలదొర క్యారెక్టర్ల చూశామని, ఇక పిట్టల దొరసాని క్యారెక్టర్ చూస్తామని ఎద్దేవా చేశారు.

# శ్రీహరికోటకు విక్రం-1 ఆర్బిటల్ రాకెట్

ఇండస్ట్రియల్ పార్క్లో నెలకొల్పిన స్కైరూట్కు చెందిన మాక్స్-క్యూ డిజైన్ ఫెసిలిటీలో విక్రం-1 రాకెట్ను రూపొందించారు. దేశ అంతరిక్ష పరిశోధనలో ప్రైవేటు రంగంలో రూపొందించి అభివృద్ధి చేసిన మొట్టమొదటి రాకెట్ ఇదే కావడం గమనార్హం. సీఎం రేవంత్ రెడ్డి స్కైరూట్ సంస్థ ప్రతినిధులతో సమావేశమై విక్రం-1 ఆర్బిటల్ రాకెట్ వివరాలను తెలుసుకుని వారితో మాట్లాడారు. అనంతరం స్కైరూట్ ఫెసిలిటీ సెంటర్ పరిశీలించారు. ఈ సందర్భంగా స్కైరూట్ బృందాన్ని సీఎం రేవంత్ రెడ్డి అభినందించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ ఏరోస్పేస్ రంగంలో ప్రపంచ అగ్రగామిగా నిలవాలన్న తెలంగాణ లక్ష్య సాధనలో ఇదొక కీలక మైలురాయిగా నిలుస్తుందని అన్నారు. ఈ రాకెట్ను పూర్తిగా హైదరాబాద్లోనే రూపొందించి, అభివృద్ధి చేయడం ఎంతో గర్వకారణమని పేర్కొన్నారు."ఉపగ్రహాలను అంతరిక్షంలోకి తీసుకువెళ్లేందుకు భారతదేశపు మొట్టమొదటి ప్రైవేటు ఆర్బిటల్ రాకెట్ను స్కైరూట్ అభివృద్ధి చేసింది. సంస్థ 2022లో తన తొలి రాకెట్ను ప్రయోగించగా, ఇంత తక్కువ సమయంలోనే ఆర్బిటల్ ప్రయోగ దశకు చేరుకోవడం ఒక అద్భుతమైన విజయం. ఏరోస్పేస్ రంగంలో దేశంలో తెలంగాణ మొదటి స్థానంలో ఉందని, బోయింగ్, ఎయిర్బస్, సాఫ్రాన్ వంటి ప్రపంచ స్థాయి సంస్థలు ఇప్పటికే తెలంగాణలో ఉన్నాయి. ఏరోస్పేస్ను కీలక వృద్ధి రంగంగా పరిగణిస్తూ 2047 నాటికి ఈ రంగంలో ప్రపంచ అగ్రగామిగా నిలవడమే తెలంగాణ లక్ష్యం" అని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. 2023 డిసెంబర్ నుంచి ఇంజనీరింగ్ ఎగుమతుల్లో తెలంగాణ అసాధారణ ప్రతిభ కనబరిచిందని సీఎం రేవంత్ రెడ్డి ప్రస్తావించారు. కేంద్ర ప్రభుత్వ గణాంకాల ప్రకారం, 2023-24, 2024-25 మధ్య ఇంజనీరింగ్ ఎగుమతుల్లో తెలంగాణ 117.9 శాతం అత్యధిక వృద్ధిని నమోదు చేసిందని తెలిపారు.

ఈ వృద్ధికి విమాన విడిభాగాలు, రక్షణ పరికరాలు ప్రధానంగా దోహదపడ్డాయని చెప్పారు. ప్రపంచ విశ్వవిద్యాలయాలు, పారిశ్రామిక దిగ్గజాలతో భాగస్వామ్యాల ద్వారా ఏరోస్పేస్ రంగం కోసం యువతకు నైపుణ్య శిక్షణ ఇవ్వడంపై ప్రభుత్వం దృష్టి సారిస్తోందని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. పటిష్టమైన విధానాలు, మౌలిక సదుపాయాలు, ప్రతిభ, చైతన్యవంతమైన పర్యావరణ వ్యవస్థతో స్కైరూట్ వంటి కంపెనీలకు మద్దతు ఇవ్వడానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని చెప్పారు.పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా ప్రతిభావంతులకు నైపుణ్య శిక్షణ ఇవ్వాల్సిన అవసరం ఉందని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ, అడ్వాన్స్డ్ టెక్నాలజీ సెంటర్లు, త్వరలో ఆధునీకరించనున్న పాలిటెక్నిక్ కళాశాలల ద్వారా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ నైపుణ్య శిక్షణా కార్యక్రమాలను సీఎం రేవంత్ రెడ్డి వివరించారు. పాఠ్యప్రణాళిక పరిశ్రమల ఆధారితంగా, అన్ని కోర్సులలో ఏకరూపంగా ఉండేలా చూసేందుకు ఏటీసీలు, పాలిటెక్నిక్ కళాశాలలు రెండింటినీ యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ పరిధిలోకి తీసుకురావాలని ప్రభుత్వం భావిస్తుందని పేర్కొన్నారు.ఇక, హైదరాబాద్లోని మల్లేపల్లిలో ఉన్న ఏటీసీని సందర్శించాల్సిందిగా స్కైరూట్ బృందాన్ని సీఎం రేవంత్ రెడ్డి ఆహ్వానించారు. సీఎం రేవంత్ రెడ్డి ప్రతిపాదనపై స్కైరూట్ ఏరోస్పేస్ సీఈఓ, సహ వ్యవస్థాపకుడు పవన్ కుమార్ చందన స్పందిస్తూ యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీతో కలిసి పనిచేయడానికి ఆసక్తితో ఉన్నట్టు తెలిపారు.

# ఒరిజినల్ ఎప్పటికీ ఒరిజినలే

అని బీఆర్ఎస్ ఈ పోస్టు ద్వారా పరోక్షంగా స్పష్టం చేసింది. తమ పార్టీ బ్రాండ్కే ప్రజల్లో ఆదరణ ఉంటుందని, కొత్తగా వచ్చిన పార్టీకి కాదని చెప్పకనే చెప్పింది. రాష్ట్రంలో అసలైన తెలంగాణ వాద పార్టీ తమదేనని చాటుకునే ప్రయత్నం చేసింది.

తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత, 'తెలంగాణ రాష్ట్ర సేన' పేరుతో కొత్త పార్టీని ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలోనే బీఆర్ఎస్ నుంచి ఈ స్పందన వచ్చింది. దీంతో టీఆర్ఎస్ పేరు చుట్టూ తెలంగాణ రాజకీయాలు మరోసారి వేడెక్కాయి.

# అమరావతి నగరం నిర్మించే అవకాశం దక్కడం నా అదృష్టం

అమరావతి (ప్రశ్న న్యూస్) ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో సైబరాబాద్ను నిర్మించి దేశానికి ఒక టెక్నాలజీ రాజధానిని అందించిన తనకు, రాష్ట్ర విభజన అనంతరం అమరావతి రూపంలో మరో నగరాన్ని నిర్మించే అద్భుతమైన అవకాశం దక్కిందని ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. ఇది తన అదృష్టంగా భావిస్తున్నానని, అమరావతిని కేవలం ఒక రాజధానిగా కాకుండా, భవిష్యత్ తరాలకు ఆదర్శంగా నిలిచే 'ఫ్యూచర్ సిటీ'గా తీర్చిదిద్దుతామని ఆయన స్పష్టం చేశారు. ముంబైలో ప్రతిష్ఠాత్మక 'ఎకనమిక్ టైమ్స్' సంస్థ నిర్వహించిన ఎక్సలెన్స్ అవార్డుల ప్రదానోత్సవంలో చంద్రబాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ చేతుల మీదుగా 'బెస్ట్ రిఫార్మర్ ఆఫ్ ద ఇయర్-2025' అవార్డును ఆయన అందుకున్నారు. అనంతరం చంద్రబాబు మాట్లాడుతూ, సంస్కరణలు, అభివృద్ధి, సంక్షేమంపై తన దార్శనికతను ఆవిష్కరించారు.

### - హైదరాబాద్ను మించిన నగరంగా అమరావతి

"రాష్ట్ర విభజన తర్వాత నాకు అమరావతి రాజధాని నిర్మాణం ద్వారా మరో నగరాన్ని నిర్మించే అవకాశం వచ్చింది. గతంలో సైబరాబాద్ నిర్మాణంతో దేశానికి ఒక టెక్నాలజీ క్యాపిటల్ను ఇవ్వగలిగాం. ఇప్పుడు అమరావతిని అంతకుమించి తీర్చిదిద్దాలన్నదే నా లక్ష్యం. ఇది కేవలం ఇటుకలు, కాంక్రీటుతో కట్టే నగరం కాదు. గ్రీన్, బ్లూ సిటీగా, నెట్-జీరో కార్బన్ కాన్సెప్టుతో పర్యావరణ హితంగా నిర్మిస్తున్నాం. హైదరాబాద్ కంటే మెరుగైన, అన్ని హంగులున్న 'హైదరాబాద్ ప్లస్' నగరంగా అమరావతి చరిత్రలో నిలిచిపోతుంది" అని చంద్రబాబు వ్యాఖ్యానించారు. ఈ అవార్డు ద్వారా రాష్ట్రానికి మరిన్ని పెట్టుబడులు వస్తాయని ఆశిస్తున్నానని, పారిశ్రామికవేత్తలు ఏపీలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు రావాలని ఈ వేదికగా పిలుపునిచ్చారు.

### - సంస్కరణలతోనే సంపద సృష్టి

నాలున్నర దశాబ్దాల తన రాజకీయ జీవితంలో సంస్కరణలకు ముందు, తర్వాత భారతదేశాన్ని క్షుణ్ణంగా చూశానని చంద్రబాబు తెలిపారు. "సంపద సృష్టికి సంస్కరణలే పునాది. సంస్కరణలు అమలు చేస్తేనే అభివృద్ధి సాధ్యం, ఆ అభివృద్ధి ఫలాలను సంక్షేమ రూపంలో ప్రజలకు అందించగలం. 1990లలో వచ్చిన ఐటీ విప్లవాన్ని అందిపుచ్చుకుని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో విజన్ 2020 అమలు చేశాం. దాని ఫలాలనే హైదరాబాద్ ఇప్పుడు అనుభవిస్తోంది. ప్రధాని నరేంద్ర మోదీ ఇప్పుడు '2047 వికసిత్ భారత్' లక్ష్యాన్ని నిర్దేశించారు. ఈ లక్ష్య సాధనలో ఆంధ్రప్రదేశ్ అగ్రస్థానంలో ఉండాలన్నదే నా ఆకాంక్ష. ప్రధాని మోదీ ఒక అత్యుత్తమ రిఫార్మర్, పెర్ఫార్మర్, విన్నర్. ఆయన నాయకత్వంలో దేశం అన్ని రంగాల్లో దూసుకెళ్తోంది" అని చంద్రబాబు ప్రశంసించారు.

### - గ్రీన్ ఎనర్జీ, ఏఐతో నవశకం

భవిష్యత్తు గ్రీన్ ఎనర్జీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ)దేనని చంద్రబాబు అన్నారు. "గతంలో విద్యుత్ సంస్కరణలతో మిగులు విద్యుత్ సాధించాం. ఇప్పుడు గ్రీన్ ఎనర్జీ, బ్యాటరీ స్టోరేజ్, గ్రీన్ అమ్మోనియా వంటి రంగాలపై దృష్టి పెట్టాం. ప్రధాని 500 గిగావాట్ల గ్రీన్ ఎనర్జీ లక్ష్యం పెడితే, అందులో ఏపీ 160 గిగావాట్ల ఉత్పత్తిని లక్ష్యంగా పెట్టుకుంది. ఇప్పటికే 90 గిగావాట్ల దిశగా అడుగులు వేశాం. త్వరలోనే విద్యుత్ను ఎగుమతి చేసే స్థాయికి ఎదుగుతాం," అని తెలిపారు. ఏఐ టెక్నాలజీని పాలనలో భాగం చేస్తూ ఏఐ డాక్టర్, ఏఐ ట్యూటర్ వంటి సేవలు అందిస్తున్నామన్నారు. విశాఖలో గూగుల్ సంస్థ 15 బిలియన్ డాలర్ల పెట్టుబడితో డేటా సెంటర్ ఏర్పాటు చేయనుందని, ఈ నెల 28న దానికి శంకుస్థాపన చేయబోతున్నామని వెల్లడించారు.

### - అభివృద్ధితో పాటే సంక్షేమం

అభివృద్ధి ఫలాలు సమాజంలోని అట్టడుగు వర్గాలకు కూడా చేరాలని చంద్రబాబు అన్నారు. "మన సమాజం కేవలం మిలియనీర్లు, బిలియనీర్ల కోసం మాత్రమే కాదు, సామాన్యులది కూడా. అందుకే 'పీ4' (ప్రజలు, పేదలు, భాగస్వామ్యం, ప్రగతి) కార్యక్రమాన్ని రూపొందించాం. సమాజంలో 10 శాతం ఉన్న ధనవంతులు, 20 శాతం ఉన్న పేదలను ఆదుకునేలా 'ఎంబీకే 10-20' ఫార్ములాను తీసుకొచ్చాం. సంపన్నులు మార్గదర్శకులుగా మారి పేదలను చేయూతనివ్వాలి," అని ఆయన పిలుపునిచ్చారు. మహిళా రిజర్వేషన్ బిల్లుపై మాట్లాడుతూ, మహిళలు సంకల్పిస్తే ఈ బిల్లు తప్పకుండా అమలవుతుందని, దీనికి తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు.

### - భవిష్యత్తు కోసం జనాభా నిర్వహణ

దేశ భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ఒక వినూత్నమైన ఆలోచనను చంద్రబాబు పంచుకున్నారు. "మూడు దశాబ్దాల క్రితం జనాభా నియంత్రణను బలంగా అమలు చేశాం. కానీ భవిష్యత్తులో మన దేశం జనాభా కొరతను ఎదుర్కోనుంది. డబ్బుంటే పరిశ్రమలు పెట్టొచ్చు, కానీ జనాభాను సృష్టించలేం. ప్రస్తుతం భారత్ ఫెర్టిలిటీ రేటు 1.9 ఉండగా, ఏపీలో అది 1.5 మాత్రమే. అందుకే, ముందుచూపుతో 'పాపులేషన్ మేనేజ్మెంట్ పాలసీ'ని తీసుకురావాలని నిర్ణయించాం. భవిష్యత్తులో జనాభా ఉన్న దేశాలే సంపన్న దేశాలుగా నిలుస్తాయి," అని చంద్రబాబు తన దూరదృష్టిని వివరించారు.

# ఎమ్మెల్సీలుగా కోదండరాం, అజారుద్దీన్

వహించాల్సి ఉంది. ఒకవేళ ఈ గడువులోగా ఎమ్మెల్సీగా నియామకం జరగకపోతే ఆయన తన మంత్రి పదవిని కోల్పోయే ప్రమాదం ఉండేది. సీఎం రేవంత్ రెడ్డి ఈ నియామకాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకోవడంతో గడువు ముగియడానికి కేవలం ఐదు రోజుల ముందే గవర్నర్ నుంచి గ్రీన్ సిగ్నల్ వచ్చింది.

దీంతో మంత్రి అజారుద్దీన్కు లైన్ క్లియర్ అయింది. కాగా, బీఆర్ఎస్ హయాంలో గవర్నర్ కోటా ఎమ్మెల్సీలుగా కుర్రా సత్యనారాయణ, దాసోజు శ్రావణ్ పేర్లను సిఫార్సు చేశారు. అయితే వారి నియామకాన్ని అప్పటి గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ తిరస్కరించారు. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ.. కొత్తగా కోదండరాం, అజారుద్దీన్ పేర్లను ప్రతిపాదించగా ఇన్నాళ్లూ ఆ ఫైల్ పెండింగ్లో ఉంది. ఈ నేపథ్యంలోనే వారం రోజుల క్రితం సీఎం రేవంత్ రెడ్డి, స్వయంగా లోక్భవన్ వెళ్లి గవర్నర్ శివ ప్రతాప్ శుక్లాతో సమావేశమయ్యారు. అజారుద్దీన్, ప్రొఫెసర్ కోదండరాం ఎమ్మెల్సీలుగా నియమించే ఫైల్ను క్లియర్ చేయాలని కోరారు. అందుకు సానుకూలంగా స్పందించిన గవర్నర్ తాజాగా వారిద్దరిని గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీగా నియమిస్తూ ఆమోదం తెలిపారు. గవర్నర్ ఆమోదంతో త్వరలోనే గెజిట్ నోటిఫికేషన్ వెలువడనుంది. ఆ వెంటనే వీరిద్దరూ ఎమ్మెల్సీలుగా ప్రమాణ స్వీకారం చేయనున్నారు.

# తెలంగాణలో భారీగా ఐఏఎస్ అధికారుల బదిలీలు

(2010 బ్యాచ్) బదిలీ ప్రధానంగా నిలిచింది. ఆమెను కార్మిక, ఉపాధి కల్పన శాఖ కార్యదర్శిగా నియమించారు. దీంతో పాటు రెవెన్యూ (విపత్తుల నిర్వహణ) శాఖ కార్యదర్శిగా కూడా ఆమెకు పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు. మరోవైపు ఖమ్మం కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి (2018 బ్యాచ్)ని ఐటీ శాఖ జాయింట్ సెక్రటరీగా బదిలీ చేసి, గనులు మరియు భూగర్భ వనరుల శాఖ డైరెక్టర్గా, తెలంగాణ మినరల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ (టీజీఎండీసీ) వీసీ ఒ ఎండీగా పూర్తి అదనపు బాధ్యతలు ఇచ్చారు.

సంగారెడ్డి కలెక్టర్ పి. ప్రవీణ్య (2016 బ్యాచ్)ను రవాణా, రోడ్లు భవనాల శాఖ స్పెషల్ సెక్రటరీగా, నిర్మల్ కలెక్టర్ అభిలాష అభినవ్ (2018 బ్యాచ్)ను ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ డైరెక్టర్, ఇంటర్ బోర్డు సెక్రటరీగా నియమించారు. ఇతర ముఖ్యమైన బదిలీలలో, పౌరసరఫరాల శాఖ డైరెక్టర్ జెండాగే హనుమంత్ కొండిబ (2016 బ్యాచ్)ను ఆరోగ్యశ్రీ హెల్త్ కేర్ ట్రస్ట్ సీఈఓగా బదిలీ చేశారు. ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ డైరెక్టర్గా ఉన్న కృష్ణ ఆదిత్య (2014 బ్యాచ్)ను పరిశ్రమలు, వాణిజ్య శాఖ ప్రత్యేక కార్యదర్శిగా నియమించారు. గిరిజన సంక్షేమ శాఖ డైరెక్టర్ బి.ఎం. సంతోష్ (2017 బ్యాచ్)ను అదే శాఖ స్పెషల్ సెక్రటరీగా నియమించి, డైరెక్టర్గా పూర్తి అదనపు బాధ్యతల్లో కొనసాగేలా ఆదేశించారు. ఈ మార్పులతో పరిపాలనను మరింత గాడిలో పెట్టాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు తెలుస్తోంది. మిగిలిన అధికారులకు కూడా వివిధ శాఖల్లో కీలక బాధ్యతలు అప్పగించారు.

# స్టేజిపైనే మంత్రి వివేక్కు ఎమ్మెల్యే కౌంటర్

**మెదక్** మంత్రి వివేక్ వెంకటస్వామిపై నర్సాపూర్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి విచుకుపడ్డారు. మెదక్ జిల్లా నర్సాపూర్ మున్సిపాలిటీ పరిధిలో కల్యాణలక్ష్మి, షాది ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతి జరిగిందని మంత్రి వివేక్ వెంకటస్వామి మాట్లాడారు.

ఈ ప్రభుత్వంలో ప్రజలు పడుతున్న కష్టాలు తీర్చకుండా, సమస్యలను గాలికి వదిలేస్తున్నారని మంత్రి వివేక్ వెంకటస్వామిపై నర్సాపూర్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి విరుచుకుపడ్డారు.

# కవిత కొత్త పార్టీ.. "తెలంగాణ రాష్ట్ర సేన"

ముందుకు వెళ్తాం. తెలంగాణలో ఏం జరుగుతుందో అర్థం చేసుకోండి. బీజేపీ అనే పార్టీకి తెలంగాణ ఏర్పాటు ఇష్టం లేదు. ఇక బీఆర్ఎస్ నీళ్లు, నిధులు, నియామకాలను గాలి కొదిలేసింది. ఆనాడు టీఆర్ఎస్ కోసం పని చేశా. ఆనాటి కేసీఆర్ వేరు ఇప్పుడు కేసీఆర్ వేరు. ఇప్పుడున్న కేసీఆర్ మారిన మనిషి, మర మనిషి, మన మనిషి కాదు. ప్రజలకు కష్టం వస్తే కేసీఆర్ రావటం లేదు. గుంట నక్కల చేతుల్లో ఖైదీ అయిన వ్యక్తి కేసీఆర్. అధికారం ముందు మమకారం తగ్గిందా.? కేసీఆర్ గారు రాజకీయ పరిణితి లేకుండా మాట్లాడుతున్నారు. రాష్ట్రంలో కర్కోటకుడి పాలన నడుస్తుంటే కేసీఆర్ పట్టించుకోవటం లేదు. అందుకోసమే నేను ఈ నిర్ణయం తీసుకున్నా. కేసీఆర్ మారుతారేమోనని వేచి చూసినా మారలేదు. నన్ను పార్టీ నుంచి సస్పెండ్ చేసి మంచే చేశారు. ఆ పార్టీలో ఉండి నేను గట్టిగా పోరాడలేకపోయా. ఇప్పుడు నా రాష్ట్రం కోసం పోరాడుతా. కాళేశ్వరంలో అవినీతి జరిగిందని చెబితే నన్ను పక్కన పడేసి పందికొక్కులను పక్కన పెట్టుకున్నారు. ఇది ప్రారంభం మాత్రమే ఇన్ ఫ్రంట్ దేరీజ్ క్రొకోడైల్ ఫెస్టివల్. ఇప్పుడు మనమే ప్రతిపక్షం అవుతాం రెండేళ్ల తర్వాత అధికారంలోకి వస్తాం.' అని కవిత వెల్లడించారు.అంతకు ముందు బంజారాహిల్స్లోని నివాసంలో కవిత దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. సర్వమత ప్రార్థనల తర్వాత కవిత తన భర్త, కుటుంబసభ్యుల ఆశీర్వాదం తీసుకున్నారు. అనంతరం బంజారాహిల్స్ నివాసం నుంచి ర్యాలీగా బయలుదేరిన కవిత పార్టీ శ్రేణులతో కలిసి అమరవీరుల స్థూపం వద్దకు చేరుకొని నివాళులర్పిం చారు. అనంతరం అక్కడ మీడియాతో మాట్లాడిన కవిత.. తెలంగా ణలో సరికొత్త విప్లవం రాబోతుందన్నారు. తాను కచ్చితంగా తెలంగాణకు సీఎం అవుతానని ధీమా వ్యక్తం చేశారు. నిరుపేద, బడుగు, బలహీనవర్గాల గొంతుకనై వారి కోసం పోరాటం చేస్తానని కవిత స్పష్టం చేశారు.

# ఎస్సార్ నగర్లో కూల్చివేతలు

**హైదరాబాదం** హైకోర్టు ఆదేశాల మేరకు ఫుట్ పాత్ ఆక్రమణలపై జి హెచ్ ఎం సి అధికారులు స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. ఎస్సార్ నగర్, బికే గూడ ప్రాంతాల్లో అక్రమంగా ఫుట్ పాత్ లను ఆక్రమించి వ్యాపారాలు చేస్తున్న వారిపై జిహెచ్ఎంసి అధికారుల ఉక్కుపాదం మోపారు. హైకోర్టు ఆదేశాల మేరకు స్పెషల్ డ్రైవ్ చేపట్టిన జిహెచ్ఎంసి అధికారులు ఎస్సార్ నగర్ పోలీస్ స్టేషన్ నుండి బి కె గూడ చౌరస్తా వరకు ఫుట్ పాత్ ఆక్రమణలను పోలీస్ బందోబస్తు మధ్య కూల్చివేతలు చేపట్టారు.

# జర్నలిస్టులకు ఆరోగ్య శిబిరం

**హైదరాబాద్** జర్నలిస్టుల ఆరోగ్యం, సంక్షేమ పరిరక్షణకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తున్నదని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి తెలిపారు. హైదరాబాద్ బేగంపేట నేచర్ క్యూర్ హాస్పిటల్ లో నిర్వహించిన మెగా జర్నలిస్టుల ఆరోగ్య శిబిరంలో ఆమె పాల్గొని మాట్లాడారు.ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా నిర్వహించిన ఈ శిబిరం ప్రభుత్వ నిబద్ధతకు నిదర్శనమని పేర్కొన్నారు. జర్నలిస్టులు నిత్యం పని ఒత్తిడికి లోనవుతుంటారని , వారి కోసం ప్రత్యేకంగా ఇలాంటి సమగ్ర ఆరోగ్య శిబిరాన్ని నిర్వహించడం రాష్ట్రంలో ఇదే తొలిసారి కావడం విశేషమన్నారు. జర్నలిస్టులు ప్రజాస్వామ్యంలో కీలక పాత్ర పోషిస్తూ ప్రభుత్వం?ప్రజల మధ్య వారధిగా నిలుస్తున్నారని, కష్టసాధ్యమైన పరిస్థితుల్లో పనిచేసే మీడియా ప్రతినిధుల ఆరోగ్యం కాపాడటం అత్యవసరమని ఆమె అన్నారు.జర్నలిస్టుల సంక్షేమం కోసం ప్రభుత్వం పలు కార్యక్రమాలు అమలు చేస్తోందని వివరించారు. హైదరాబాద్ జిల్లాలో 94 మంది జర్నలిస్టులకు ?94 లక్షలు ఆర్థిక సహాయం, 17 మందికి అనారోగ్య సహాయం అందించామని చెప్పారు. అలాగే జర్నలిస్టుల కుటుంబాలకు నెలవారీ పెన్షన్, పిల్లలకు విద్యా సహాయం, వేలాది ఆరోగ్య కార్డుల జారీ, ఉచిత బస్సు పాసులు వంటి పథకాలు అమలులో ఉన్నాయని వెల్లడించారు.వేగంగా మారుతున్న సమాచార యుగంలో నిజ నిర్ధారణతో కూడిన బాధ్యతాయుత జర్నలిజం అవసరమని, ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించడంలో మీడియా పాత్ర కీలకమని కలెక్టర్ పేర్కొన్నారు. జర్నలిస్టులు ఈ ఆరోగ్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

# చేనేత కళలను ప్రోత్సహించాలి

**హైదరాబాద్** చేనేత కళలను ప్రోత్సహించాలని పద్మశ్రీ డాక్టర్ పద్మజారెడ్డి అన్నారు. శ్రీనగర్కాలనీలోని సత్యసాయి నిగమాగమంలో నేషనల్ సిల్క్ ఎక్స్పో పేరిట ఏర్పాటు చేసిన చేనేత వస్త్రప్రదర్శనను ఆమె ప్రారంభించారు. వస్త్ర ప్రదర్శనలోని వస్త్రాలను తిలకించి చేనేతకారులను అభినందించారు. దేశంలో ప్రముఖ నగరాలకు చెందిన చేనేత కారులు తమ ఉత్పత్తులైన సిల్క్, కాటన్, డిజైనరీ వస్త్రాలను సుమారు 80 స్టాళ్లల్లో ప్రదర్శిస్తున్నారని నిర్వాహకులు జయేషుప్తా చెప్పారు. ఈనెల 28వ తేదీ వరకు ఈ ఎగ్జిబిషన్ అందుబాటులో ఉంటుందని తెలిపారు.

## సింగపూర్లో 5వ రోజు కొనసాగుతున్న

# మంత్రుల శిక్షణ కార్యక్రమం

**అమరావతి** సింగపూర్ సంక్షోభ నిర్వహణ వ్యవస్థ - (రాతినిణజీజూనీతీవ'బ అతీతిబతిబ ఓజీనిజీణవఎవనిబి బఎబబివఎ) గురించి మంత్రులు బృందం అధ్యయనం చేస్తున్నారు. విపత్తు వేళలో సింగపూర్ లో ప్రభుత్వ శాఖలు ఏకతాటిపైకి వచ్చి సమన్వయంతో పని చేసే...'హోల్-ఆఫ్-గవర్నమెంట్'(చిష్ట్రనీశ్రీవ-నీట-ఉనీలవతీనిఎవనిబి) విధానం గురించి రాజూరా అసిస్టెంట్ ప్రొఫెసర్ రజ్వానా వివరించారు. × సంక్షోభంలో నాయకత్వం, నైతిక నిర్ణయాలు ప్రాధాన్యత, రాబోయే ప్రమాదాలను ముందే ఊహించి సిద్ధంగా ఉండటం వంటి అంశాలపై చర్చ జరిగింది. × ఈ కార్యక్రమంలో మంత్రులు అచ్చెన్నాయుడు, బి.సి. జనార్దన్ రెడ్డి, వంగలపూడి అనిత, సత్యకుమార్ యాదవ్, అనగాని సత్యప్రసాద్ పాల్గొన్నారు.

# మైలవరంలో ఇంధన కొరత

**మైలవరం** ఎన్టీఆర్ జిల్లా మైలవరంలో ఇంధన కొరత తీవ్రమైంది. శుక్రవారం సాయంత్రం నుండి పెట్రోల్ బంకుల్లో ఇంధనం లేకపోవడంతో వాహనాలు కిలోమీటర్ల మేర క్యూ కట్టాయి. ఏదో ఒక సమయానికి ఇంధనం వస్తుందనే ఆశతో వాహనదారులు బంకుల వద్ద వేచి చూస్తున్నారు.

అధికారులు స్పందించి ఈ సమస్యను త్వరగా పరిష్కరించాలని వారు కోరుతున్నారు.ఆయిల్ కంపెనీలు సరఫరా తగ్గించడంతో పెట్రోల్ బంకులు ఖాళీ అయ్యాయి. దీనివల్ల వరి కోతలు నిలిచిపోయాయి, ఆక్వా చెరువులకు ఏరియేటర్లు నడపలేక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. క్రెడిట్ సౌకర్యం రద్దు కావడం డీలర్లకు అదనపు సమస్యగా మారింది. వాహనదారులు, రైతులు వెంటనే సరఫరా పునరుద్ధరించాలని కోరుతున్నారు.

## ఇబ్రహీంపట్నంలో నడిరోడ్డుపై

# అగ్నికి ఆహుతైన కారు!

**విజయవాడ**ఇబ్రహీంపట్నం రింగ్ సెంటర్ సమీపంలో కారులో ఒక్కసారిగా చెలరేగిన మంటలలో కారు దగ్ధమయింది. బ్యాటరీలో సాంకేతిక లోపం కారణంగా ఇంజిన్ నుండిమంటలు వ్యాపించచాయి. వాహనదారులు భయాందోళనలో పడ్డారు. విధుల్లో ఉన్న ట్రాఫిక్ పోలీసుల మెరుపు వేగంతో స్పందించారు. మంటలను అదుపు చేసి పెను ప్రమాదాన్ని తప్పించారు. పోలీసుల సమయస్ఫూర్తితో కారు ప్రయాణికులు ప్రాణాపాయం నుంచి బయటపడ్డారు. ఘటనతో ట్రాఫిక్ రహదారిపై నిలిచిపోయింది. దెబ్బతిన్న వాహనాన్ని రోడ్డు పక్కకు తొలగించి ట్రాఫిక్ ను క్రమబద్ధీకరించారు.

## ప్రజా దర్బార్కు హాజరు కాని

# అధికారులపై ఎమ్మెల్యే ఫైర్

**విజయవాడ** రామవరప్పాడులో ప్రజా దర్బార్ కార్యక్రమం లో ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు పాల్గొన్నారు. అధికారులతో కలిసి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ప్రజా దర్బార్ కార్యక్రమానికి హాజరుకాని అధికారులపై ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు ఫైర్ అయ్యారు. ప్రోటోకాల్ పాటించని అధికారులు సస్పెండ్ కు సిద్ధంగా ఉండండి.. 400 పైన ప్రజా సమస్యల అర్జీలు వచ్చాయి. అధికారులకు బాధ్యత లేదా అని ప్రశ్నించారు. అధికారులకు ప్రభుత్వం జీతం ఇచ్చేది ప్రజల సమస్యలను తీర్చడానికి. ఇది ప్రైవేట్ కార్యక్రమం కాదు ప్రభుత్వం చేపట్టిన ప్రజా దర్బార్. త్వరలోనే రామవరప్పాడులో అన్న క్యాంటీన్, పోలీస్ స్టేషన్ భవన ఏర్పాటు చేస్తానని అన్నారు.

## ఇరాన్ తో చర్చల కోసం

# పాకిస్థాన్ వెళ్లొద్దు

### - అమెరికా బృందానికి ట్రంప్ ఆదేశం



న్యూయార్క్ (ప్రశ్న న్యూస్) అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంచలన నిర్ణయం తీసుకున్నారు. ఇరాన్‌తో చర్చల నిమిత్తం తమ ప్రతినిధుల బృందం పాకిస్థాన్‌లోని ఇస్లామాబాద్‌కు వెళ్లాల్సి ఉండగా, ఆ పర్యటనను రద్దు చేస్తున్నట్లు శనివారం ప్రకటించారు. చర్చల కోసం అంత దూరం ప్రయాణించడం సమయం వృథా అని, వాళ్లు మాట్లాడాలనుకుంటే ఫోన్ చేస్తే సరిపోతుందని ఆయన స్పష్టం చేశారు. ఈ మేరకు తన సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ట్రూత్ సోషల్'లో ఆయన ఒక పోస్ట్ పెట్టారు. "ఇరాన్‌తో సమావేశం కోసం ఇస్లామాబాద్ వెళుతున్న నా ప్రతినిధుల పర్యటనను ఇప్పుడే రద్దు చేశాను. ప్రయాణంతో సమయం వృథా అవుతుంది. పైగా, ఇరాన్ నాయకత్వంలో తీవ్ర గందరగోళం, అంతర్గత కుమ్ములాటలు ఉన్నాయి. ఎవరి చేతిలో అధికారం ఉందో వారికే తెలియదు" అని ట్రంప్ వ్యాఖ్యానించారు.అయితే, అమెరికా ప్రతినిధులతో నేరుగా సమావేశమయ్యే ప్రణాళిక ఏదీ లేదని ఇరాన్ ముందుగానే స్పష్టం చేసింది. పాకిస్థాన్ మధ్యవర్తిత్వంతోనే తమ అభిప్రాయాలు తెలియజేస్తామని చెప్పింది. ఈ ప్రకటన తర్వాత ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరగ్చి నేతృత్వంలోని బృందం పాకిస్థాన్ నుంచి బయలుదేరి వెళ్లిపోయింది. ఈ పరిణామాల తర్వాతే ట్రంప్ తన నిర్ణయాన్ని ప్రకటించడం గమనార్హం. "అన్ని అస్త్రాలు మా చేతిలోనే ఉన్నాయి, వాళ్ల చేతిలో ఏమీ లేదు. ఒకవేళ వాళ్లు మాట్లాడాలనుకుంటే, చేయాల్సిందల్లా ఒక్క ఫోన్ కాల్ మాత్రమే!" అని ట్రంప్ తన పోస్టులో ఘాటుగా పేర్కొన్నారు. ఈ చర్చల కోసం అమెరికా తరఫున ట్రంప్ అల్లుడు జారెడ్ కుష్నర్, ప్రత్యేక రాయబారి స్టీవ్ విట్‌కాఫ్ వెళ్లాల్సి ఉంది. తాజా పరిణామంతో ఇరు దేశాల మధ్య ఉద్రిక్తతలను తగ్గించేందుకు జరుగుతున్న మధ్యవర్తిత్వ ప్రయత్నాలకు తాత్కాలికంగా బ్రేక్ పడినట్లయింది.

## శ్రీవారిని దర్శించుకున్న మంత్రి డోలా

**తిరుమల** ఆంధ్రప్రదేశ్ మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయ స్వామి తిరుమలలో శ్రీవారిని దర్శించుకున్నారు.శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంకు వెళ్లి భక్తి శ్రద్ధలతో శ్రీ వెంకటేశ్వర స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. దర్శనం అనంతరం స్వామి వారి తీర్థప్రసాదాలను ఆలయ పూజారులు మంత్రికి అందించారు.

## గుండ్లపాలెంలో ప్రాచీన శాసనం లభ్యం

**ప్రకాశం** ప్రకాశం జిల్లా కందుకూరు తాలూకా గుండ్లపాలెంలో 1258?1259 సంవత్సరాల నాటి అరుదైన యాదవరాజుల వంశ చరిత్రను తెలిపే శాసనం లభ్యమైంది. కొండయ్య కుమారుడు రామయ్య వేయించిన ఈ శాసనం, నాలుగు వైపులా 182 పంక్తులతో యదుకుల వంశ చరిత్రను వివరిస్తోంది. ఈ చారిత్రక ఆవిష్కరణతో గ్రామస్థులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

## స్పోర్ట్స్ హబ్‌గా మంగళగిరి

**మంగళగిరి** ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ సెక్రటరీ ఌ రాజ్యసభ సభ్యులు సానా సతీష్ మీడియాతో మాట్లాడారు. గుంటూరు జిల్లా మంగళగిరిలో ఏప్రిల్ 25, 26 తేదీల్లో 'టాటా ఐపీఎల్ ఫ్యాన్ పార్క్' ఏర్పాటు చేస్తున్నామని వెల్లడించార. మంగళగిరిని స్పోర్ట్స్ హబ్గా తీర్చిదిద్దడమే లక్ష్యం:. రెండ్రోజుల పాటు భారీ స్క్రీన్లపై నాలుగు ఐపీఎల్ మ్యాచ్ల ప్రత్యక్ష ప్రసారం వుంటుందని అన్నారు. స్టేడియంలో మ్యాచ్ చూస్తున్న అనుభూతిని కలిగించేలా ఫ్యాన్ పార్క్ ఏర్పాటు జరుగుతోంది. మంగళగిరి ప్రజల్లో ఉన్న క్రీడా స్ఫూర్తిని గుర్తించి బీసీసీఐ ఈ అవకాశం ఇచ్చింది. ఐపీఎల్ ఫ్యాన్ పార్క్కు వచ్చే క్రికెట్ ప్రేమికుల కోసం అన్ని మౌలిక వసతుల ఏర్పాటు వుంటుంది. స్టార్ స్పోర్ట్స్ ఛానెల్లో మంగళగిరి ఫ్యాన్ పార్క్ దృశ్యాల ప్రత్యక్ష ప్రసారం వుంటుందని అయన అన్నారు.మంగళగిరిని అంతర్జాతీయ స్థాయి స్పోర్ట్స్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సా అభివృద్ధి చేస్తాం. నారా లోకేష్ చొరవతో మంగళగిరిలో క్రీడల అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు. అమరావతిలో 30-40 వేల మంది సామర్థ్యంతో త్వరలోనే కొత్త స్టేడియం నిర్మాణం. జూన్ 5 లోపు మంగళగిరి స్టేడియం కనెక్టివిటీ రోడ్ల పనులు పూర్తి చేస్తామన్నారు.

## శంషాబాద్ ఎయిర్ పోర్ట్ టర్మినల్ కు బాంబు బెదిరింపు

**రంగారెడ్డి** శంషాబాద్ ఎయిర్ పోర్టుకు బాంబు బెదిరింపు మెయిల్ వచ్చింది. శంషాబాద్ ఎయిర్ పోర్ట్ టెర్మినల్ లో బాంబు ఉందని బెదిరింపు మెయిల్ రావడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. సెక్యూరిటీ అధికారులు తనిఖీలు చేపట్టారు . ఎయిర్ పోర్ట్ టెర్మినల్ తనిఖీ చేయగా ఎలాంటి బాంబు లేదని తేల్చేసారు.

# డిస్టెన్స్ మోడ్‌లో డిగ్రీ...

### - సర్కారీ ఉద్యోగాలకు రెడ్ సిగ్నల్

**హైదరాబాద్,** దూరవిద్యా విధానంలో డిగ్రీలు పూర్తి చేసి ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న అభ్యర్థులకు తెలంగాణ హైకోర్టు బిగ్ షాక్ ఇచ్చింది. ఇతర రాష్ట్రాలకు చెందిన విశ్వవిద్యాలయాలు తమ రాష్ట్ర సరిహద్దులు దాటి నిర్వహిస్తున్న స్టడీ సెంటర్ల ద్వారా పొందే డిగ్రీలు ప్రభుత్వ ఉద్యోగాలకు పనికిరావని ఉన్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. ఈ తీర్పుతో వేలాది మంది అభ్యర్థుల భవిష్యత్తు ఇప్పుడు ప్రశ్నార్థకమైంది. తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ 2022లో విడుదల చేసిన లైబ్రేరియన్ పోస్టుల నోటిఫికేషన్ ఈ వివాదానికి మూలమైంది. ఈ ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకున్న కొందరు అభ్యర్థులు.. ఆంధ్రప్రదేశ్‌లోని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం నుండి మాస్టర్స్ ఇన్ లైబ్రరీ సైన్స్ పూర్తి చేశారు. అయితే వీరు ఈ డిగ్రీని ఏపీలో కాకుండా తెలంగాణలో ఉన్న ఆ వర్సిటీ స్టడీ సెంటర్ల ద్వారా దూరవిద్యా విధానంలో పొందారు. సర్టిఫికెట్ల వెరిఫికేషన్ సమయంలో వీరి డిగ్రీలు చెల్లవని టీజీపీఎస్సీ తిరస్కరించడంతో అభ్యర్థులు హైకోర్టును ఆశ్రయించారు.

గతంలో ఇదే తరహా డిగ్రీలతో కొందరికి ఉద్యోగాలు వచ్చాయని వారు వాదించారు.ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేష్ కుమార్ సింగ్, జస్టిస్ జి.ఎం. మొహియుద్దీన్‌లతో కూడిన ధర్మాసనం ఈ కేసులో కీలక వ్యాఖ్యలు చేసింది. ఒక రాష్ట్ర చట్టం కింద ఏర్పడిన విశ్వవిద్యాలయం తన కార్యకలాపాలను ఆ రాష్ట్ర సరిహద్దులకే పరిమితం చేయాలి. ఇతర రాష్ట్రాల్లో స్టడీ సెంటర్లు పెట్టి డిగ్రీలు ఇవ్వడం యూజీసీ నిబంధనలకు విరుద్ధమని స్పష్టం చేసింది. 2013లో యూజీసీ జారీ చేసిన పబ్లిక్ నోటీసు ప్రకారం.. ఏ వర్సిటీ కూడా తన ప్రాదేశిక అధికార పరిధిని దాటి వెళ్లకూడదు. తెలంగాణలో ఏపీ వర్సిటీ సెంటర్లు నిర్వహించడం చట్టవిరుద్ధమని కోర్టు తెలిపింది. 2017 నియామకాల్లో ఇలాంటి డిగ్రీలను అంగీకరించారు కదా అని అభ్యర్థులు చేసిన వాదనను కోర్టు తోసిపుచ్చింది. "గతంలో జరిగిన అవకతవకలు లేదా తప్పులను.. కొత్త తప్పులకు సమర్థనగా వాడలేము" అని ధర్మాసనం స్పష్టం చేసింది. ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టంలోని నిబంధనలు స్టడీ సెంటర్ల నిర్వహణకు అనుమతిస్తాయన్న వాదనను కూడా కోర్టు తిరస్కరించింది.ఈ తీర్పు కేవలం లైబ్రేరియన్ పోస్టులకే పరిమితం కాకుండా రాబోయే అన్ని ప్రభుత్వ ఉద్యోగ నియామకాలపై ప్రభావం చూపే అవకాశం ఉంది. ముఖ్యంగా తెలంగాణలో ఉంటూ పక్క రాష్ట్రాల వర్సిటీల (ఉదాహరణకు ఆచార్య నాగార్జున, అన్నామలై, మదురై కామరాజ్ వంటివి) స్టడీ సెంటర్ల ద్వారా డిగ్రీలు పొందిన వారు ఇప్పుడు ఆందోళనలో ఉన్నారు.

# విషవాయువుల గనిగా జవహర్‌నగర్ డంపింగ్ యార్డ్

### - గంటకు 6 టన్నుల మీథేన్ విడుదల

- జవహర్‌నగర్ డంపింగ్ యార్డ్‌పై కాలిఫోర్నియా వర్సిటీ సంచలన నివేదిక
- ప్రపంచంలో అత్యధిక మీథేన్ వెలువరించే ప్రాంతాల్లో యార్డ్‌కు 4వ స్థానం
- గంటకు 5.9 టన్నుల మీథేన్ విడుదల.. 10 లక్షల కార్ల కాలుష్యంతో సమానం
- నిర్వహణ లోపంతో లక్ష టన్నుల చెత్త పేరుకుపోవడమే ప్రధాన కారణం
- చుట్టుపక్కల ప్రజల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం పడుతోందని నిపుణుల ఆందోళన



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) జవహర్‌నగర్ డంపింగ్ యార్డ్ విషవాయువుల గనిగా మారిందని, ఇది హైదరాబాద్ నగరానికి పెను ముప్పుగా పరిణమించిందని ఓ అంతర్జాతీయ నివేదిక హెచ్చరించింది. యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియా (లాస్ ఏంజెలెస్) సాఫ్ట్ మీథేన్ ప్రాజెక్టులో భాగంగా జరిపిన పరిశీలనలో ఈ యార్డ్ నుంచి గంటకు 5.9 టన్నుల మీథేన్ గ్యాస్ వెలువడుతున్నట్లు తేలింది. ప్రపంచవ్యాప్తంగా అత్యధిక మీథేన్ ఉద్గారాలు వెలువడుతున్న 25 ప్రాంతాల్లో జవహర్‌నగర్ నాలుగో స్థానంలో నిలవడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. ఈ యార్డ్ వల్ల తమ ఆరోగ్యాలు దెబ్బతింటున్నాయని, భూగర్భ జలాలు కలుషితమవుతున్నాయని స్థానికులు ఎన్నో ఏళ్లుగా చేస్తున్న ఆరోపణలకు ఈ నివేదిక బలం చేకూర్చింది. నిపుణుల అంచనా ప్రకారం జవహర్‌నగర్ నుంచి వెలువడుతున్న మీథేన్ ఉద్గారాలు ఏకకాలంలో 10 లక్షల కార్లు ప్రయాణించినా లేదా 500 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తికి బొగ్గును మండించినా వెలువడే కాలుష్యంతో సమానం. ఈ జాబితాలో ముంబైలోని ఓ డంపింగ్ యార్డ్ గంటకు 4.9 టన్నుల మీథేన్‌తో 12వ స్థానంలో ఉంది. వ్యర్థాల నిర్వహణ శాస్త్రీయంగా జరుగుతోందంటూ జీహెచ్ఎంసీ, రాంకీ ఎన్విరో సంస్థలు చేస్తున్న ప్రకటనలు పూర్తిగా అవాస్తవమని ఈ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. ప్రస్తుతం నగరంలోని మూడు కార్పొరేషన్ల నుంచి రోజూ సగటున 9,600 టన్నుల చెత్త జవహర్‌నగర్‌కు చేరుతోంది.

అయితే, అక్కడ ఉన్న యంత్రాల సామర్థ్యం రోజుకు కేవలం 1000 నుంచి 1200 టన్నుల చెత్తను మాత్రమే వేరు చేయగలదు. దీంతో తడి, పొడి చెత్తను వేరు చేయకుండానే కుప్పలుగా పోస్తున్నారు. ఫలితంగా యార్డులో నిత్యం 80 వేల నుంచి లక్ష టన్నుల చెత్త పేరుకుపోయి, దాని నుంచి భారీగా మీథేన్ గ్యాస్ విడుదలవుతోంది. ఈ మీథేన్ వాయువు కార్బన్ డయాక్సైడ్ కంటే 25 రెట్లు అధికంగా భూతాపానికి కారణమవుతుందని పర్యావరణవేత్తలు హెచ్చరిస్తున్నారు. దీనివల్ల గాలిలో ఆక్సిజన్ తగ్గి తలతిరగడం, శ్వాస సమస్యలు, గుండె సంబంధిత వ్యాధులు వచ్చే ప్రమాదం ఉంది. మీథేన్‌కు మండే స్వభావం ఉండటంతో భారీ అగ్నిప్రమాదాలు జరిగే ముప్పు కూడా పొంచి ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

## అక్రమ నిర్మాణాలపై కమిషనర్‌ను

# ఏకీపారేసిన న్యాయమూర్తి

- అక్రమ నిర్మాణాలకు కొమ్ము కాస్తే జైల్లో పెడతామని హెచ్చరిక
- హైదరాబాద్ లో అక్రమ నిర్మాణాలపై కోర్టులు హెచ్చరించిన పట్టించుకోని అధికారులు
- అక్రమ నిర్మాణాలపై న్యాయమూర్తులు స్పందించి కమిషనర్ల, అవినీతి అధికారుల పై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజల విన్నపం

విరాట్ (ప్రశ్న న్యూస్) ఉత్తర్ ప్రదేశ్ రాష్ట్రంలోని మీరట్ పట్టణంలో అక్రమ నిర్మాణాల వ్యవహారం దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. కోర్టు ఆదేశాలను పట్టించుకోకుండా, కుంటి సాకులు చెబుతూ అక్రమ నిర్మాణాలకు మద్దతు ఇస్తున్న అధికారులపై న్యాయమూర్తి జేబీ పార్దివాల తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ తీర్పును అమలు చేయడంలో విఫలమైన కలెక్టర్, కమిషనర్ రిషికేష్ భాస్కర్ యశోద్‌పై తీవ్రంగా మండిపడుతూ, న్యాయ వ్యవస్థను అవమానించేలా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అవసరమైతే అధికారులను జైలుకు పంపించడానికైనా వెనుకాడబోమని స్పష్టం చేశారు. న్యాయమూర్తి వ్యాఖ్యలు కేవలం హెచ్చరికలు మాత్రమే కాకుండా, అమలు చేయాల్సిన బాధ్యతపై గట్టి సందేశంగా మారాయి. "చెప్పింది చెప్పినట్టు అమలు చేయాలి" అన్న ఆయన వ్యాఖ్యలు అధికార యంత్రాంగం నిర్లక్ష్యాన్ని బహిర్గతం చేశాయి. అక్రమ నిర్మాణాలపై చట్టం కఠినంగా ఉండగా, వాటిని అడ్డుకోవాల్సినవారే సహకరిస్తే ప్రజల విశ్వాసం దెబ్బతింటుందని ఆయన స్పష్టం చేశారు. ఇదిలా ఉంటే తెలంగాణలోని జిహెచ్ఎంసి పరిధిలో కూడా ఇదే పరిస్థితి నెలకొన్నట్లు తీవ్ర ఆరోపణలు వినిపిస్తున్నాయి. నగరంలో విచ్చలవిడిగా కొనసాగుతున్న అక్రమ నిర్మాణాలపై కోర్టులు పలుమార్లు హెచ్చరికలు జారీ చేసినప్పటికీ, డిప్యూటీ, జోనల్ కమిషనర్లు, ఉన్నత అధికారులు వాటిని పెద్దగా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నోటీసులు ఇవ్వడం వరకు మాత్రమే పరిమితమై, కూల్చివేతలు లేదా కఠిన చర్యలు తీసుకోవడంలో తీవ్ర ఆలస్యం జరుగుతుందని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రభుత్వ ఆదాయానికి గండికొట్టే విధంగా, నిబంధనలు అతిక్రమిస్తూ భారీ నిర్మాణాలు కొనసాగుతున్నప్పటికీ, సంబంధిత విభాగాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయన్న ఆరోపణలు గట్టిగా వినిపిస్తున్నాయి. దీనిపై మరోసారి కోర్టులు జోక్యం చేసుకుని, జిహెచ్ఎంసి కమిషనర్లపై కఠిన చర్యలు తీసుకోని గ్రేటర్ హైదరాబాద్ ను రక్షించాలని నగర వాసులు డిమాండ్ చేస్తున్నారు. మీరట్ ఘటనను దృష్టిలో పెట్టుకుని, న్యాయస్థానాల ఆదేశాలను అమలు చేయకపోతే ఎదురయ్యే పరిణామాలు ఎంత తీవ్రంగా ఉంటాయో స్పష్టమైంది. ఇదే తరహా పరిస్థితులు హైదరాబాద్‌లో పునరావృతం కాకుండా ఉండాలంటే జిహెచ్ఎంసి అధికారులు వెంటనే చర్యలు తీసుకుని అక్రమ నిర్మాణాలపై కఠినంగా వ్యవహరించి కూల్చివేతలు చేయవలసిన అవసరం ఉందని నిపుణులు సూచిస్తున్నారు.




## యాదగిరిగుట్టలో శ్రీ లక్ష్మీనరసింహస్వామి

# జయంతి ఉత్సవాలు



యాదగిరిగుట్ట(ప్రశ్న న్యూస్)ఈ నెల 26 వ తేదీ నుండి ఈ నెల 30 వ తేదీ వరకు 5 రోజుల పాటు యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో నరసింహ స్వామి జయంతి ఉత్సవాలు జరగనున్నాయన్నారు ఆలయ ఈఓ భవాని శంకర్ తెలిపారు. 26వ తేదీన ఉదయం స్వస్తి వాచనం తో ఉత్సవాలు ప్రారంభమై 30 వ తేదీన సహస్ర కళాశాభిషేకం తో ఉత్సవాలు ముగుస్తాయని శనివారం ప్రెస్మీట్ నిర్వహించి వెల్లడించారు. జయంతి ఉత్సవాలు జరిగే ఐదు రోజుల పాటు ఆలయంలో భక్తులచే నిర్వహించే సుదర్శన నరసింహ హోమం,నిత్యా,శాశ్వత కళ్యాణం,బ్రహ్మోత్సవాలు రద్దు చేశామన్నారు. 30వ తేదీన ఉదయం ఆలయంలో నిర్వహించే నిజాభిషేకం,సహస్రనామార్చన రద్దు చేశామని తెలిపారు.జయంతి ఉత్సవాలు జరిగే ఐదు రోజులు ఆలయ ప్రాంగణంలో ఆధ్యాత్మిక,ధార్మిక,సంగీత,సాహిత్య కార్యక్రమాలు జరుగుతామన్నారు.30వ తేదీన సాయంత్రం తూర్పు రాజాగోపురం ఎదురుగా 108 మంది వీణా వాయిద్య కళాకారులతో వీణా వాయిద్య సంగీత కచేరి ఉంటుందన్నారు.30వ తేదీన నృసింహ జయంతి రోజున నిత్యా గిరిప్రదక్షిణ కార్యక్రమం చేపడుతామన్నారు.సింహ ద్వారం వద్ద స్వామి వారి పాదాలు ఏర్పాటు చేస్తామన్నారు.భక్తులు ఆలయ కొండచుట్టు ప్రతి రోజు గిరిప్రదక్షిణ చేసేలా ఏర్పాటు చేస్తామన్నారు.జయంతి ఉత్సవాల్లో హోవనం పాల్గొనే భక్తులు 2000 రూపాయల టికెట్,లక్ష కుంకుమార్చన పాల్గొనే భక్తులు 2000 రూపాయల టికెట్,లక్ష పుష్పార్చన లో పాల్గొనే భక్తులకు 2000 రూపాయల టికెట్ ఏర్పాటు చేశామన్నారు.

## శ్రీ లక్ష్మీ నరసింహ జయంతి ఉత్సాలకు

# ముస్తాబవుతున్న యాదగిరిగుట్ట





యాదగిరిగుట్ట (ప్రశ్న న్యూస్)యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహ స్వామి ఆలయం నృసింహ జయంతి ఉత్సవాలకు ముస్తాబు అవుతుంది.ఈ నెల 26 వ తేదీ నుండి 30 వ తేదీ వరకు ఐదు రోజుల పాటు యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహ స్వామి ఆలయం లో జయంతి ఉత్సవాలు జరగనున్నాయి.స్వస్తివాచనం తో జయంతి ఉత్సవాలను ప్రారంభించి ఐదు రోజుల పాటు ఉదయం సాయంత్రం వివిధ రకాల పూజలు నిర్వహించనున్నారు ఆలయ అర్చకులు.జయంతి ఉత్సవాలకు సర్వం సిద్ధం చేస్తున్నారు.ఆలయాన్ని విద్యుత్ దీపాలంకరణ తో దేదీప్యమానంగా అలంకరించారు. ప్రధానాలయం లో కన్నుల విందుగా పుష్పాలంకరణ చేశారు.జయంతి ఉత్సవాల పూజలు నిర్వహించడానికి పంచకుండాత్మక యాగశాలను ఆలయ అర్చకులు సిద్ధం చేశారు.

## రెవెన్యూ, హౌసింగ్ అంశాలపై ప్రజా ప్రతినిధులతో

# మంత్రి పొంగులేటి క్షేత్రస్థాయి సమీక్షలు

**నేడు ఉమ్మడి నిజామాబాద్, ఆదిలాబాద్ జిల్లా సమావేశాలు**



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)ఇందిరమ్మ ఇళ్లు, రెవెన్యూ అంశాలపై రాష్ట్ర రెవెన్యూ, హసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సోమవారం నుండి క్షేత్రస్థాయి సమీక్షలకు శ్రీకారం చుట్టనున్నారు. ఈ మేరకు హిమాయత్‌నగర్ లోని హౌసింగ్ కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం ఉదయం ఉమ్మడి నిజామాబాద్ జిల్లా మధ్యాహ్నం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ప్రజా ప్రతినిధులు, కలెక్టర్లతో సమీక్షా సమావేశం నిర్వహిస్తారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాలకు సంబంధించి ఇటువంటి సమావేశాలను దశలవారీగా నిర్వహించనున్నారు.రాష్ట్రంలో తొలి విడతగా మూడున్నర లక్షల ఇందిరమ్మ ఇళ్ల మంజూరు. సుమారు లక్షకు పైగా ఇళ్ళు గృహ ప్రవేశాలకు సిద్ధమైన నేపథ్యంలో మంత్రి గారు నిర్వహించే ఈ సమావేశం ప్రాధాన్యతను సంతరించుకుంది. అసంపూర్తి గా ఉన్న డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల పూర్తి, కేటాయింపు, మౌలిక వసతుల కల్పన వంటి విషయాలను కూడా చర్చించనున్నారు. అంతేగాక త్వరలో రెండవ విడత ఇళ్ల మంజూరుకు సంబంధించి కూడా ఈ సమావేశంలో చర్చించే అవకాశాలు ఉన్నాయి. అదేవిధంగా భూ వివాదాలు, పట్టాదారు పాస్ పుస్తకాల జారీ,తాజాగా అమలు చేస్తున్న భూధార్ , సర్వేమ్యాప్‌ల వంటి కీలక రెవెన్యూ అంశాలపై జిల్లా అధికారులతో మంత్రి చర్చించనున్నారు. ఈ సమావేశంలో ఆయా జిల్లాల ఇన్‌ఛార్జి మంత్రులు, మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు పాల్గొంటారు. అలాగే జిల్లా కలెక్టర్లు, అడిషనల్ కలెక్టర్లు, ఆర్డీవోలు, జిల్లా హౌసింగ్ అధికారులు పాల్గొననున్నారు.

## మంచినీరు వృథా.. రోడ్లపైన జలశయం

# పట్టించుకోని మున్సిపల్ అధికారులు



కీసర(ప్రశ్న న్యూస్) మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కీసర సర్కిల్ దమ్మాయిగూడ మున్సిపాలిటీ పరిధిలోని బండ్లగూడ మసీదు ఎదురుగా గత కొన్ని రోజులుగా త్రాగునీరు వృధాగా ప్రవహిస్తోంది. పైపులైన్ లీకేజీ కారణంగా వేల లీటర్ల మంచినీరు రోడ్డు పాలవుతున్నా, అధికారులు కనీసం కన్నెత్తి చూడటం లేదని స్థానికులు వాపోతున్నారు. వేసవి కాలం కావడంతో అనేక ప్రాంతాల్లో నీటి ఎద్దడి నెలకొన్న తరుణంలో, ఇలా వేల లీటర్ల నీరు వృధా కావడంపై కాలనీ వాసులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యపై అధికారులకు ఫిర్యాదు చేసినా ఇప్పటివరకు ఎటువంటి స్పందన లేదని వారు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి, తక్షణమే లీకేజీని అరికట్టి నీటి వృధాను అరికట్టాలని బండ్లగూడ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

## కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు నీలం మధు ముదిరాజ్‌ను

# మర్యాదపూర్వకంగా కలిసిన బెజుగామ సర్పంచ్



గజ్వేల్(ప్రశ్న న్యూస్) సిద్దిపేట జిల్లా గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ఎస్.ఎల్.ఎన్. కన్వెన్షన్ హాల్‌లో శనివారం నాడు మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి, సీనియర్ నాయకులు నీలం మధు ముదిరాజ్‌ను బెజుగామ గ్రామ సర్పంచ్ నక్కీర్త గోపాల్, ముదిరాజ్ సంఘం నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు నీలం మధు ముదిరాజ్‌కు శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం నియోజకవర్గంలోని పలు అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో నక్కీర్త గోపాల్ (బెజుగామ గ్రామ సర్పంచ్), ముదిరాజ్ సంఘం నాయకులు అందే మహిపాల్ ముదిరాజ్, బల్ల కరుణాకర్ ముదిరాజ్, పేర నరసింహులు ముదిరాజ్, అందే దేవేందర్ ముదిరాజ్, అడప సురేందర్ ముదిరాజ్ పాల్గొన్నారు.

# ధాన్యాన్ని రోడ్లపై ఆరబెట్టుకో వద్దు

## రైతు సోదరులకు పోలీసుల విజ్ఞప్తి




ఎల్లారెడ్డిపేట (ప్రశ్న న్యూస్) రైతులు పండించిన ధాన్యాన్ని రోడ్లపై ఆరబెట్టుకోవడం వలన రాత్రి సమయాల్లో వాటిని గ్రహించలేక రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నందున రైతులెవరు రోడ్డుపై వరి ధాన్యాన్ని ఆరబోసి ప్రమాదాల కారణం కావద్దని తెలిపినారు. ఎవరైనా రోడ్డుపై ధాన్యం ఆరబెట్టిన కారణంగా ప్రమాదాలు జరిగితే అట్టి యజమానిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని ఎల్లారెడ్డిపేట సీఐ ఓ.వెంకటేష్ తెలిపారు.

## అధికారం కోల్పోయి రెండేళ్లవుతున్నా

# వైసీపీ పద్ధతి మార్చుకోలేదు

- రవాణశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి
- యూజ్ అండ్ కిల్".. ఇదే జగన్ పొలిటికల్ పిక్చర్
- సొంత జిల్లాలో హత్య జరిగితే ఎందుకు జగన్మోహన్ రెడ్డి వెళ్లి పరామర్శించలేదు.
- జగన్ కనుసన్నల్లోనే పెద్దదస్తగిరి హత్య జరిగింది




మంగళగిరి (ప్రశ్న న్యూస్)"యూజ్ అండ్ కిల్".. ఇదే జగన్ పొలిటికల్ పిక్చర్ అని రవాణశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి తీవ్రంగా వ్యాఖ్యానించారు. శనివారం మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో వైసీపీ పార్టీ సాగిస్తున్న అరాచక రాజకీయాలపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. జగన్మోహన్ రెడ్డి రాజకీయ ముఖచిత్రం యూజ్ అండ్ కిల్' అని విమర్శించారు. అధికారం కోల్పోయి రెండేళ్లయినా వైసీపీ నాయకుల ఆగడాలు తగ్గలేదని మంత్రి మండిపడ్డారు. తాడేపల్లి ప్యాలెస్ కేంద్రంగా కమాండ్ కంట్రోల్ సెంటర్ నడుపుతూ రాష్ట్రవ్యాప్తంగా అరాచకాలు సాగిస్తున్నారని ఆరోపించారు. కడపలో జరిగిన పెద్ద దస్తగిరి హత్య జగన్మోహన్ రెడ్డి కనుసన్నల్లోనే జరిగిందని మంత్రి ఆరోపించారు. జగన్ మేనమామ రవీంద్రనాథ్ రెడ్డికి ముఖ్య అనుచరుడిగా ఉన్న దస్తగిరిని, భూ లావాదేవీల గొడవల్లో భాగంగా వైసీపీ ముఠాలే అంతం చేశాయని పేర్కొన్నారు. దస్తగిరి ఇంట్లో జరిగిన పోలీసుల తనిఖీల్లో వందల కోట్ల ఆస్తుల డాక్యుమెంట్లు దొరికాయని, అందులో రవీంద్రనాథ్ రెడ్డి, అతని భార్య, కుమారుడి పేర్లు ఉండటం వైసీపీ ముఠాల భూదోపిడీకి సజీవ సాక్ష్యాలని తెలిపారు. రాష్ట్రంలో ఎక్కడ చిన్న సంఘటన జరిగినా 'దండయాత్ర' చేసే జగన్, తన సొంత జిల్లాలో తన ముఖ్య అనుచరుడు హత్యకు గురైతే ఎందుకు పరామర్శించలేదని ప్రశ్నించారు. నాడు బాబాయి వివేకాను చంపి, చంద్రబాబు పై నిందలు వేసి 'నారాసుర రక్త చరిత్ర' అని ప్రచారం చేసినట్టే ఇప్పుడు దస్తగిరి హత్యను కూడా కూటమి ప్రభుత్వంపై నెట్టాలని కుట్రలు చేస్తున్నారని దుయ్యబట్టారు. డ్రైవర్‌ను చంపి డోర్ డెలివరీ చేసిన ఎమ్మెల్సీ అనంతబాబు వంటి వారిని ప్రోత్సహించడం జగన్ నైజమని, వైసీపీకి నీతి నిజాయితి చిత్తశుద్ధి ఉంటే అరెస్ట్ అయిన అనంతబాబును తక్షణమే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. వైసీపీ నేతలు భూకబ్జాలు చేసి కట్టిన ప్యాలెస్‌లు, దౌర్జన్యాలపై ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తుందని.. భూములు కోల్పోయిన వారందరికీ న్యాయం చేస్తామని మంత్రి భరోసా ఇచ్చారు. "నేర సామ్రాజ్యాలు స్థాపించడం జగన్మోహన్ రెడ్డికే చెల్లుతుంది. అందుకే రాయలసీమలో వైసీపీ భూస్థాపితం అయిందని, అరాచక రాజకీయాలను రాష్ట్ర ప్రజలు ఇక నమ్మరు" అని మంత్రి రాంప్రసాద్ రెడ్డి స్పష్టం చేశారు.

## శ్రీశైలం కొండ పైన స్థానిక సత్రాలవారితో

# సమావేశం నిర్వహించిన ఈవో

**క్షేత్రాన్ని సందర్శించే భక్తులకు సత్రాల నిర్వాహకులు ఇతోధిక సేవలు అందించాలి**

**వేసవి తీవ్రత కారణంగా అన్ని సత్రాలవారు చలివేంద్రాలను ఏర్పాటు చేయాలి**

**సత్ర ప్రాంగణాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలి**

**శుచీశుభ్రతలకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలి**

**కార్యనిర్వహణాధికారి యం. శ్రీనివాసరావు**





శ్రీశైలం (ప్రశ్న న్యూస్) ప్రభుత్వం శ్రీశైలమహాక్షేత్రాన్ని తిరుమల స్థాయిలో అభివృద్ధి చేయాలనే కృతనిశ్చయంతో ఉందని కార్యనిర్వహణాధికారి యం. శ్రీనివాసరావు అన్నారు.
ఇందుకు అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలను దేవస్థానం దశలవారిగా కల్పించడం జరుగుతోందన్నారు. స్థానిక సత్రాల వారందరు కూడా క్షేత్రాభివృద్ధికి సహకరించాలన్నారు.పరిపాలనా భవనంలోని సమావేశమందిరంలో స్థానిక సత్రాల వారితో కార్యనిర్వహణాధికారివారు ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కార్యనిర్వహణాధికారివారు మాట్లాడుతూ అన్ని సత్రాలవారు కూడా సేవా దృక్పథంతో భక్తులకు సేవలను అందించాలన్నారు.అన్నీ సత్రాలకు కూడా దేవస్థానం నుంచి పూర్తి సహాయ సహకారాలు అందజేయడం జరుగుతుందన్నారు. ఇంకా వారు మాట్లాడుతూ వేసవి తీవ్రత కారణంగా అన్నీ సత్రాల వారు చలివేంద్రాలను ఏర్పాటు చేయాలన్నారు. ఈ చలివేంద్రాలలో మంచినీటితో పాటు మజ్జిగను కూడా ఉచితంగా భక్తులకు అందించాలన్నారు. ప్రతీ సత్రం వారు కూడా శుచీశుభ్రతలకు ప్రాధాన్యమివ్వాలన్నారు. సత్ర ప్రాంగణాన్ని పరిశుభ్రంగా ఉంచుకునేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలన్నారు. అదేవిధంగా సత్రాలు అన్నదానం కోసం ఆయా వంటకాలు వండేటప్పుడు, అన్నదానం చేసినప్పుడు కూడా శుచీశుభ్రత ఉండేవిధంగా అవసరమైన అన్ని జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వంటకాలలో తాజా కూరగాయలను వాడాలన్నారు. ఈ విషయమై సత్ర యజమాన్యాల వారు వారి సిబ్బందికి అవగాహన కల్పించాలన్నారు. ఈ సమావేశంలో రెవెన్యూ విభాగం సహాయ కార్యనిర్వహణాధికారి సి.హెచ్. శ్రీనివాసరెడ్డి, ప్రజాసంబంధాల అధికారి టి. శ్రీనివాసరావు, రెవెన్యూ విభాగపు పర్యవేక్షకులు యం. శ్రీనివాసరావు తదితర సిబ్బంది పాల్గొన్నారు.

# బాల్య వివాహం అడ్డుకున్న అధికారులు

**సిడబ్ల్యుసి ఎదుట హాజరు పరిచేందుకు బాలిక తరలింపు**



ఎల్లారెడ్డిపేట (ప్రశ్న న్యూస్) పోతిరెడ్డిపల్లె గ్రామంలో జరుగుతున్న బాల్యవివాహాన్ని అధికారులు అడ్డుకున్నారు. గ్రామంలో బాల్య వివాహం జరుగుతోందని రెండు రోజుల క్రితం 1098కు సమాచారం అందడంతో తహసీల్దార్ సుజాత, ఐ.సి.డీ.ఎస్. సిరిసిల్ల సీడీపీఓ ఉమారాణి, సూపర్ వైజర్ వనిత, డీ.సి.పీ.ఓ కవిత చైల్డ్‌లైన్ కోఆర్డినేటర్ స్రవంతి, పోలీసు సిబ్బంది గ్రామానికి చేరుకున్నారు. బాలిక తల్లిదండ్రులను వివరాలు అడిగినా వారు సహకరించకపోగా తప్పుదోవ పట్టించే సమాచారం ఇచ్చారు. దీంతో అధికారులు బాలిక చదివిన పాఠశాల నుంచి రికార్డులు సేకరించగా, 24-08-2009న జన్మించినట్లు ధృవీకరించారు. బాలిక వయస్సు చట్టపరంగా వివాహానికి తక్కువగా ఉండటంతో తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ చేసి వివాహాన్ని నిలిపివేశారు. ఈ సమయంలో బాలిక బంధువులు అడ్డుకోవడంతో తీవ్ర వాగ్వివాదం చోటుచేసుకుంది. అంగన్వాడి టీచర్ సమాచారం ఇచ్చిందని ఆరోపిస్తూ ఆమెపై దౌర్జన్యం చేయడానికి ప్రయత్నించిన ఘటన చోటు చేసుకుంది. అనంతరం బాలికను బాలల సంరక్షణ కమిటీ ఎదుట హాజరు పరిచేందుకు సిరిసిల్లకు తరలించారు. ఈ సందర్భంగా అధికారులు గ్రామస్తులకు బాల్యవివాహాలు చట్టవిరుద్ధమని స్పష్టం చేస్తూ, అలాంటి వివాహాల వల్ల బాలికల ఆరోగ్యం, విద్య, భవిష్యత్తుపై కలిగే దుష్ప్రభావాలపై అవగాహన కల్పించారు. బాల్యవివాహాలను నిరోధించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు.

# కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర

- అదనపు కలెక్టర్ గడ్డం నగేష్
- కొనుగోలు కేంద్రాలు, రైస్ మిల్లుల పరిశీలన



ఎల్లారెడ్డిపేట( ప్రశ్న న్యూస్) రైతులు తాము కష్టపడి పండించిన పంట ఉత్పత్తులను రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించి మద్దతు ధర పొందాలని అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ తెలియజేశారు. ఎల్లారెడ్డిపేట మండలం రాగట్లపల్లి, గొల్లపల్లిలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను అదనపు కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాల్లో రైతులకు అన్ని వసతులు కల్పించాలని నిర్వాహకులను ఆదేశించారు.

### రైస్ మిల్లుల్లో తనిఖీ

ఎల్లారెడ్డిపేట మండలంలోని శ్రీ లలిత పరమేశ్వరీ, రుద్ర శివ ఇండస్ట్రీస్, శ్రీ రాజరాజేశ్వర ఇండస్ట్రీస్, శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర ఆగ్రో ఇండస్ట్రీస్ మిల్లును అదనపు కలెక్టర్ తనిఖీ చేశారు. మిల్లులకు ధాన్యం లోడ్ తో వచ్చిన వాహనాలను ఆలస్యం చేయకుండా దింపుకొని వాహనాలు తిరిగి కొనుగోలు కేంద్రాలను వెళ్లేలా సహకరించాలని అన్నారు. తహశీల్దార్ సుజాత, రెవెన్యూ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# నీలోజిపల్లి గ్రామంలో వాటర్ ప్లాంట్ నిర్వహణ కమిటీ ఏర్పాటుకు గ్రామ సభ ఆమోదం

**- గ్రామ ప్రజలకు శుద్ధమైన నీటిని అందించడమే లక్ష్యం**

**- బాల వికాస వాటర్ ప్లాంట్ గౌరవాధ్యక్షులు : అనుముల భాస్కర్**



బోయినిపల్లి (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా, నీలోజిపల్లి గ్రామ పంచాయతీలో శనివారం గ్రామ సభ నిర్వహించి, బాల వికాస సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్ నిర్వహణ కోసం కమిటీని ఏర్పాటు చేశారు. జిల్లా పంచాయతీ అధికారి ఉత్తర్వులను అనుసరించి నిర్వహించిన ఈ గ్రామ సభలో, గ్రామ ప్రజల సమక్షంలో కమిటీకి ఆమోదం తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్ అనుముల భాస్కర్ మాట్లాడుతూ, గ్రామ ప్రజలకు శుద్ధి చేసిన తాగునీరు అందించడమే ప్రధాన లక్ష్యమని తెలిపారు. వాటర్ ప్లాంట్ నిర్వహణలో కమిటీ సభ్యులు సమన్వయంతో పనిచేసి ప్రజలకు నిరంతర సేవలు అందించాలని కోరారు.

### కమిటీ సభ్యుల వివరాలు

గౌరవ అధ్యక్షులుగా అనుముల భాస్కర్ (సర్పంచ్, నీలోజిపల్లి),అధ్యక్షులుగా ఎర్ర శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా ఆవుల నాగరాజు,ప్రధాన కార్యదర్శిగా ఆవుల లక్ష్మణ్,కోశాధికారిగా కత్తెరపాక దర్శన్,కార్యవర్గ సభ్యులుగాఎర్ర రాములు,ఆవుల లక్ష్మి,అనుముల పద్మ,కూస మహేందర్,ముస్కు నాగరాజు,అనుముల మల్లయ్య,ఆవుల శ్రీలత లను ఎన్నుకున్నారు.గ్రామాభివృద్ధి దిశగా ఈ కమిటీ సమర్థవంతంగా పనిచేసి, వాటర్ ప్లాంట్ నిర్వహణను సజావుగా కొనసాగించేందుకు కృషి చేస్తుందని గ్రామస్థులు ఆశాభావం వ్యక్తం చేశారు.

# సిద్దిపేటలో ఘనంగా శ్రీ వాసవి మాత జయంతి ఉత్సవాలు

**ఘనంగా శివపార్వతుల కళ్యాణ మహోత్సవం**

**వాసవి మాత జయంతి ఉత్సవాల్లో పాల్గొన్న వంగపల్లి అంజయ్య స్వామి**




గజ్వేల్ (ప్రశ్న న్యూస్) సిద్ధిపేట జిల్లా కేంద్రంలోని ఆర్యవైశ్య భవన్ లో శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి జయంతి ఉత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు శనివారం వాసవి మాతకు ప్రత్యేక పూజలు నిర్వహించి లక్ష పుష్పార్చన అనంతరం శివపార్వతుల కళ్యాణం కన్నుల పండుగగా నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలతో పాటు మహా అన్న ప్రసాదం అందజేశారు ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖ ఆధ్యాత్మికవేత్త కాచారం శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ వంగపల్లి అంజయ్య స్వామి ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అందరికీ శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి జయంతి శుభాకాంక్షలు తెలిపారు సిద్ధిపేట ఆర్యవైశ్య భవన్ లో అత్యంత వైభవంగా వాసవి మాత జయంతి ఉత్సవాలు నిర్వహిస్తున్నారని నిర్వాహకులను అభినందించారు వాసవి మాత చూపిన అహింస మార్గం, ధర్మరక్షణ త్యాగనిరతి ప్రతి ఒక్కరికి ఆదర్శమని సమాజ సేవలో వైశ్యులు ముందు ఉండాలని అమ్మవారి ఆశీస్సులతో అందరూ సుఖ సంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య భవన్ కార్యవర్గం, కమిటీ సభ్యులు, ఆర్యవైశ్య సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# మృత్యుపాశంలా మారిన నాలా

## రక్షణ గోడ లేక వాహనదారుల ప్రాణసంకటం

**అధికారులు స్పందించేది ఎప్పుడు.? ప్రాణాలు పోయాకనా.?**

**బండ్లగూడలో నాలాపై భయాందోళన**

**రక్షణ గోడ నిర్మించాలని ప్రజలు డిమాండ్**





కీసర (ప్రశ్న న్యూస్)మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కీసర సర్కిల్ దమ్మాయిగూడ డివిజన్ బండ్లగూడ నుంచి అద్రాస్ పల్లి వెళ్లే దారిలో మహంకాళి టెంపుల్ దగ్గర నాలా (కాలువ)కు సేఫ్టీ వాల్ (రక్షణ గోడ) లేకపోవడం వల్ల వాహనాలు కాలువలో పడి ప్రమాదాలు జరుగుతున్నాయి. వాహనదారులకు అటువైపు వెళ్లాలంటే భయాందోళనకు గురి అవుతున్నారు. రోడ్డుకు ఇరువైపులా రక్షణ గోడ లేక వాహనాలు నాలాలో పడి ప్రమాదాలు జరుగుతున్నాయి. ప్రజల ప్రాణాలు పోయాకనా మీరు స్పందించేది అని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడ నిత్యం వందల సంఖ్యలో వాహనాలు రాకపోకలు జరుగుతాయి. గతంలో కూడా చెత్త డంపింగ్ లారీ ఈ కాలువలో పడి ప్రమాదం జరిగింది. సంబంధిత అధికారులు స్పందించి ఈ కాల్వకు రహదారి పక్కన రక్షణ గోడ ఏర్పాటు చేయాలని వాహనదారులు డిమాండ్ చేస్తున్నారు. మనుషుల ప్రాణాలు కాలువలో కలవకుండా కాపాడాలని కోరుచున్నారు.

# టీఆర్ఎస్ సభకు..భారీగా తరలిన గజ్వేల్ జనం

**- వందకు పైగా వాహనాల్లో తరలి వెళ్లిన ప్రజలు - రాష్ట్ర నేత కొట్టాల యాదగిరి ప్రత్యేక కృషి ఫలితం**



గజ్వేల్ ( ప్రశ్న న్యూస్ ) జాగృతి వ్యవస్థాపక చైర్మన్ కల్వకుంట్ల కవిత నేతృత్వంలో జరిగిన తెలంగాణ రాష్ట్ర సేన సభకు గజ్వేల్ మున్సిపల్ తో పాటు నియోజకవర్గ పరిధిలోని ఆయా మండలాల నుండి జనం భారీగా తరలి వెళ్లారు. హైకోర్టు న్యాయవాది, జాగృతి రాష్ట్ర ఉపాధ్యక్షులు కొట్టాల యాదగిరి గత వారం రోజులుగా జన సమీకరణపై ప్రత్యేక దృష్టి సారించి మండలాల బాధ్యతలు పలువురు నేతలకు అప్పగించారు. దీంతో కల్వకుంట్ల కవిత నేతృత్వంలో శనివారం హైదరాబాదులో జరిగిన కార్యక్రమానికి వందలాది వాహనాల్లో జనం తరలి వెళ్లడం కనిపించింది. ఉద్యమకారులు, అమర వీరుల కుటుంబ సభ్యులు గత పదేళ్ల కేసీఆర్ పాలనపై వ్యతిరేకంగా ఉండడం, పలువురు నేతలను ఆ పార్టీ నిర్లక్ష్యం చేయడంతో వారు కవిత సభకు సంపూర్ణ సహకారం అందించారు. ముఖ్యంగా అధికార, ప్రతిపక్ష పార్టీలపై విసుగు చెందిన నేతలు, రైతులు, యువత, మహిళలు, కార్మికులు, విద్యార్థులు తరలి వెళ్లగా, మల్లన్న సాగర్ ముంపు గ్రామాల ప్రజల నుండి మంచి స్పందన కనిపించింది. అయితే కవిత ప్రకటించిన తెలంగాణ రాష్ట్ర సేన పార్టీ ప్రకటన అన్ని వర్గాలను ఆలోచింపజేసింది. గజ్వేల్ మున్సిపల్ తో పాటు రూరల్ మండలం, కొండపాక, జగదేవ్ పూర్, మర్కుక్, వర్గల్, ములుగు, మనోహరాబాద్, తూప్రాన్, రాయపోల్ మండలాల నుండి తరలి వచ్చిన వివిధ వర్గాలతో పాటు ఇందుకు సహకరించిన ప్రతి ఒక్కరికి జాగృతి రాష్ట్ర ఉపాధ్యక్షులు కొట్టాల యాదగిరి ముదిరాజ్ కృతజ్ఞతలు తెలిపారు.

# అంగరంగ వైభవంగా శ్రీ రుక్మిణి సత్యభామ సమేత శ్రీ వేణుగోపాల స్వామి వారి బ్రహ్మోత్సవాలు



గుంటూరు (ప్రశ్న న్యూస్) తాడికొండ గ్రామంలో శ్రీ రుక్మిణి సత్యభామ సమేత శ్రీ వేణుగోపాలస్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా సోమవారం ఉదయం 10 గంటలకు పంచామృత స్నాపనం తో ప్రారంభం కానున్నాయి. ఏప్రిల్ 27 సోమవారం ఉదయం 10 గంటలకు శ్రీ స్వామివారికి పంచామృత స్నాపనం అనంతరం రాత్రి 7 గంటలకు అంకురార్పణ ధ్వజారోహణం తో ప్రారంభం. ఏప్రిల్ 28 మంగళవారం నాడు హనుమంతు వాహన ఉత్సవం ఏప్రిల్ 29 బుధవారం రాత్రి 8 గంటలకు పొన్నవాహన ఉత్సవం ఏప్రిల్ 30 గురువారం నాడు ఉదయం 10 గంటలకు శ్రీ నరసింహ జయంతి ప్రత్యేక పూజలు, అదే రోజు రాత్రి 7 గంటలకు శ్రీ స్వామివారి గజవాహన ఉత్సవము శేష వాహన ఉత్సవము ఉత్సవానంతరం శ్రీవారి కల్యాణం నిర్వహించనున్నారు మే ఒకటవ తేదీన శుక్రవారం నాడు గరుడ వాహన ఉత్సవము సాయంత్రం ఆరు గంటలకు దివ్య రథోత్సవము జరగనున్నాయి మే రెండవ తేదీన శనివారం నాడు రాత్రి 8 గంటలకు అసోవాహన ఉత్సవము మే మూడు ఆదివారం నాడు ఉదయం 9 గంటలకు పుష్ప యాగము నిర్వహించనున్నారు మే మూడవ తేదీ నుండి 15వ తేదీ వరకు ఉదయం 10 గంటలనుండి ప్రతిరోజు ప్రత్యేక పూజలు రాత్రి 8 గంటలకు పవళింపు సేవలు జరగనున్నాయి.ఈ సందర్భంగా ఆలయంలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేసి చలువ పందిళ్లు రంగవల్లులు తీర్చిదిద్దారు. యొక్క వార్షిక బ్రహ్మోత్సవాలు భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించనున్నారు. ప్రతిరోజు ఉదయం సాయంత్రం స్వామివారి వాహన సేవలు భక్తులను అలరించనున్నాయి. ఈ యొక్క కార్యక్రమంలో ఆలయ అధికారులు గ్రామ పెద్దలు ఉత్సవ కమిటీ నిర్వహించనునారు.

# పేద పిల్లలు ఉన్నత స్థాయిలో ఉండాలన్నదే సీఎం చంద్రబాబు నాయుడు లక్ష్యం

**మంత్రి డా.డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి**

**తిరుపతి అంబేద్కర్ స్టడీ సర్కిల్లో మంత్రి డిఎస్ బీవీ స్వామి ఆకస్మిక తనిఖీ**



తిరుపతి (ప్రశ్న న్యూస్) పేద పిల్లలు ఉన్నత స్థాయిలో ఉండాలన్నదే సీఎం చంద్రబాబు నాయుడు లక్ష్యమని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డా.డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి అన్నారు. తిరుపతిలోని అంబేద్కర్ స్టడీ సర్కిల్ ను మంత్రి డిఎస్ బీవీ స్వామి శనివారం నాడు ఆకస్మిక తనిఖీ చేశారు. కోచింగ్ సెంటర్లో శిక్షణ పొందుతున్న అభ్యర్థులను సౌకర్యాల గురించి అడగగా వారు సంతృప్తి వ్యక్తం చేశారు. పేద పిల్లలకు నాణ్యమైన ఉన్నత స్థాయి ప్రమాణాలతో కూడిన విద్య, నైపుణ్యం అందించి వారిని ఉన్నత స్థాయిలో ఉంచడమే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు లక్ష్యంగా పనిచేస్తున్నారన్నారు. తిరుపతి, విజయవాడ,విశాఖ అంబేద్కర్ స్టడీ సర్కిళ్లలో 340 మందికి సివిల్స్ కు ప్రిపేర్ అయ్యే అభ్యర్థులకు సివిల్స్ ఉచిత రెసిడెన్షియల్ శిక్షణ ఇస్తున్నామని,మరో 100 మందికి ట్యాబ్ లు ఇచ్చి ఆన్లైన్లో శిక్షణ ఇప్పిస్తున్నామని మంత్రి తెలిపారు. నర్సింగ్ విద్యార్థులకు జర్మనీ లాంగ్వేజ్లో శిక్షణ ఇచ్చి జర్మనీలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నామన్నారు. పేద విద్యార్థులు, యువత అభ్యున్నతికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ప్రభుత్వం కల్పించే సౌకర్యాలను వినియోగించుకొని ప్రతి ఒక్కరూ కష్టపడి చదివి తల్లిదండ్రుల కలలను నెరవేర్చాలని మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి అన్నారు.

# తెలుగుదేశం పార్టీ పొలిట్ బ్యూరో సభ్యురాలుగా ఎదిగిన ఎమ్మెల్యే గళ్ళా మాధవి

**అభినందించిన మాజీ ఎమ్మెల్సీ రాయపాటి శ్రీనివాస్, తాడిశెట్టి మురళీ, మద్దిరాల మ్యానీ**



గుంటూరు (ప్రశ్న న్యూస్) తెలుగుదేశం పార్టీ పొలిట్ బ్యూరో సభ్యురాలిగా నియమితులైన గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి ని మాజీ ఎమ్మెల్సీ రాయపాటి శ్రీనివాస్ , మాజీ క్రిస్టియన్ మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ మద్దిరాల మ్యానీ , టీడీపీ రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి తాడిశెట్టి మురళీ మర్యాదపూర్వకంగా కలుసుకుని శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అనతి కాలంలోనే తెలుగుదేశం పార్టీ అత్యున్నత స్థాయి అయిన పొలిట్ బ్యూరో సభ్యురాలిగా ఎంపిక కావడం గర్వకారణమని పేర్కొన్నారు. గళ్ళా మాధవి కృషి, నాయకత్వ లక్షణాలు, ప్రజల పట్ల నిబద్ధత వల్లే ఈ స్థాయికి చేరుకున్నారని అభినందించారు. భవిష్యత్తులో కూడా పార్టీ అభివృద్ధికి, ప్రజా సేవకు మరింత కృషి చేయాలని ఆకాంక్షిస్తూ తమ పూర్తి మద్దతు ఉంటుందని తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు గళ్ళా మాధవి కి శుభాకాంక్షలు తెలియజేస్తూ పుష్పగుచ్ఛం అందజేశారు.

# పోలవరం ఎడమ కాలువ పనులు పరిశీలించిన మంత్రి నిమ్మల రామానాయుడు

**జూన్ నాటికి అనకాపల్లి వరకు గోదావరి జలాలు**

**శరవేగంగా సాగుతున్న పోలవరం ఎడమ కాలువ పనులు**



తుని (ప్రశ్న న్యూస్)కూటమి ప్రభుత్వం చెప్పింది చేస్తుంది, చేసేదే చెబుతుంది. ప్రజలకు జవాబుదారీతనంగా ఉంటుందని రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు అన్నారు. పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు ఎడమ ప్రధాన కాలువ పనులను ఆయన శనివారం నాడు అన్నవరం సమీపంలోని పంపా ఆక్విడెక్టు, తుని మండలం లోని కుమ్మరిలోవ గ్రామం తదితర ప్రాంతాలలో క్షేత్ర స్థాయి లో పర్యవేక్షించారు. తునిలో ఈ కాల్వ పనులకు సంబంధించిన ఇంజనీరింగ్ నిపుణులు, అధికారులు, కాంట్రాక్ట్ ఏజెన్సీల ప్రతినిధులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఆయన పర్యటన తాలూకు విశేషాలను, సమీక్షలో చర్చించిన అంశాలను మీడియా దృష్టికి తీసుకొచ్చారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు గోదావరి జలాలను మొదటి దశ లో, జూన్ లోగా అనకాపల్లి వరకు తీసుకెళ్తామని రామానాయుడు చెప్పారు.
నాడు జగన్ ఐదేళ్ల వికృత పాలన, విధ్వంసపాలన, తిరోగమన పాలనలో పోలవరం ఎడమ కాలువ పనులను గాలికి వదిలేసారని ఆయన విమర్శించారు. అర బస్తా సిమెంట్ గాని, తట్టమట్టి గాని వేసిన దాఖలాలు లేవన్నారు. ఐదేళ్ల ఆ పాలనకు అలవాటు పడ్డ అధికార యంత్రాంగం తమ తీరు మార్చుకోవాలని, గడువు లోపల పనులు పూర్తిచేయాలని హెచ్చరించారు.
ఈ కార్యక్రమం లో జలవనరుల శాఖ సలహాదారు వెంకటేశ్వరరావు, ఈ ఎన్ సి నరసింహ మూర్తి, పోలవరం ఎడమ ప్రధాన కాలువ ఎస్ ఈ ఏసు బాబు, ఇతర ఉన్నత అధికారులు పాల్గొన్నారు.

## మూగజీవాల సంరక్షణ మనందరి బాధ్యత

- గంభీరావుపేట ఏఎస్సై : గూడ దేవేందర్ రెడ్డి
- గంభీరావుపేట పోలీస్ అధికారి సేవాభావం
- గోశాలకు వరిగడ్డి వితరణ



వేములవాడ (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా, గంభీరావుపేట పోలీస్ స్టేషన్లో ఏఎస్సైగా విధులు నిర్వహిస్తున్న గూడ దేవేందర్ శనివారం మూగజీవాలపై తనకున్న మమకారాన్ని చాటుతూ వేములవాడలోని శ్రీ రాజరాజేశ్వరస్వామి గోశాలకు 342 వరిగడ్డి కట్టలను వితరణ చేశారు. ఈ సందర్భంగా గూడ దేవేందర్ మాట్లాడుతూ, "మూగజీవాల సంరక్షణ మన అందరి బాధ్యత. ముఖ్యంగా ఎండలు తీవ్రంగా ఉన్న ఈ సమయంలో గోశాలల్లో ఉన్న పశువులకు తగిన ఆహారం అందించడం చాలా అవసరం. చిన్న సహాయం చేసినా పెద్ద ఉపశమనం కలిగిస్తుంది. సమాజంలోని ప్రతి ఒక్కరూ తమవంతు సహాయం చేయాలని కోరుతున్నాను"అని, గతంలో కూడా అనేక మార్లు గడ్డి వితరణ చేయడం జరిగిందని తెలిపారు.

## వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే రైతులకు మద్దతు ధర.

**మంథని ఏఎంసీ చైర్మన్ కుడుదుల వెంకన్న**

**సర్పంచి కొండ ప్రేమలత రవీందర్.**



మంథని ( ప్రశ్న న్యూస్) ప్రభుత్వం ద్వారా ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే రైతులకు మద్దతు ధర లభిస్తుందని మంథని ఏఎంసీ చైర్మన్ కుడుదుల వెంకన్న అన్నారు. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం మంథని అధ్వర్యంలో మండలంలోని విలోచవరం గ్రామంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సర్పంచ్ కొండ ప్రేమలత - రవీందర్ తోకలిసి మంథని ఏ ఎంసీ చైర్మన్ కుడుదుల వెంకన్న శుక్రవారం సాయంత్రం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంథని ఏ ఎంసీ చైర్మన్ కుడుదుల వెంకన్న మాట్లాడుతూ రైతులు అరుగాలం శ్రమించి పండించిన పంటను దళారులకు విక్రయించరాదని, వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించి ప్రభుత్వ మద్దతు ధర పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అయిలి ప్రసాద్, నాయకులు సాదుల శ్రీకాంత్, ఎరుకల ప్రవీణ్, పర్శవేణి మోహన్, కోరవేన రవి కుమార్, రైతులు, సంఘ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఆర్టీసీ చర్చలు సఫలం

**ఆర్టీసీ కార్మికులకు టిపిసిసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాల మురళి కృష్ణ (చిన్నా ముదిరాజ్) శుభాకాంక్షలు**



పటాన్చెరు( ప్రశ్న న్యూస్ ) ఆర్టీసీ కార్మికుల సుదీర్ఘ నిరీక్షణకు తెరదించుతూ ప్రభుత్వం జరిపిన చర్చలు సఫలం కావడం పట్ల టిపిసిసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాలమురళి కృష్ణ (చిన్నా ముదిరాజ్) హర్షం వ్యక్తం చేశారు. ఆర్టీసీ కార్మికుల సమస్యలను సానుకూలంగా పరిష్కరించినందుకు ఆయన ప్రజా పాలన ప్రభుత్వానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కార్మికుల చిరకాల వాంఛలైన కీలక అంశాలపై ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలను కొనియాడారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలనే నిర్ణయం కార్మికుల భవిష్యత్తుకు భరోసానిస్తుందని పేర్కొన్నారు. పెండింగ్‌లో ఉన్న 11 శాతం పీఆర్సీని ప్రకటించడం ద్వారా కార్మికుల ఆర్థిక ఇబ్బందులు తొలగుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్య పద్ధతిలో గుర్తింపు సంఘాల ఎన్నికల నిర్వహణకు మొగ్గు చూపడం శుభపరిణామమని ఆయన అన్నారు. ఆర్టీసీ కార్మికుల కష్టాలను గుర్తించి, వారి సమస్యల పరిష్కారానికి కృషి చేసిన ముఖ్యమంత్రికి, మంత్రులకు ధన్యవాదాలు తెలుపుతూ ఈ విజయం ఆర్టీసీ కార్మికులందరిదీ," అని బాల మురళి కృష్ణ ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు. ఈ నిర్ణయాల పట్ల ఆర్టీసీ కార్మికులు, వారి కుటుంబ సభ్యులు సంతోషం వ్యక్తం చేస్తున్నారని, ప్రభుత్వం ఇలాగే ప్రజా రవాణా వ్యవస్థను బలోపేతం చేస్తూ కార్మికుల సంక్షేమానికి కట్టుబడి ఉండాలని ఆయన కోరా

## నవవధువు వివాహానికి పుస్తె మట్టెలు

**2 వ వార్డ్ కౌన్సిలర్ గోలి మమత సంతోష్**



గజ్వేల్ (ప్రశ్న న్యూస్) సిద్దిపేట జిల్లా గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ 2 వ వార్డ్ కౌన్సిలర్ గోలి మమత సంతోష్ ఆధ్వర్యంలో శనివారం గజ్వేల్ మండలం దిలాల్ పూర్ గ్రామానికి చెందిన నవవధువు నేహ వివాహానికి పుస్తె మట్టెలు చీర సారే అందజేశారు , ఈ సందర్భంగా గోలి మమత సంతోష్ మాట్లాడుతూ మానవసేవే మాధవసేవ అని వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని, రాబోయే రోజుల్లో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని అన్నారు ఈ కార్యక్రమంలో రవీందర్ రెడ్డి, స్వామి గౌడ్,బాలకృష్ణ, తదితరులు పాల్గొన్నారు

# శ్రీపాదరావు స్మారకార్థం చలివేంద్రం ప్రారంభించిన.

# మంథని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు తొట్ల తిరుపతి యాదవ్.

**శ్రీధర్ బాబు ఆశీస్సులతో. శీను బాబు ఆశీర్వాదముతో.**





మంథని ( ప్రశ్న న్యూస్) మంథని నియోజకవర్గం పరిధిలోని రామగిరి మండలం రామయ్య పల్లి భుదవారం పేట గ్రామము లో స్వర్గీయ దుద్దిల్ల శ్రీపాద రావు స్మారకార్థం కాంగ్రెస్ యూత్ నాయకులు సతీష్ ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని రిబ్బన్ కట్ చేసి ప్రారంభించిన మంథని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు తొట్ల తిరుపతి యాదవ్ సందర్భముగా తిరుపతి యాదవ్ మాట్లాడుతు..మాజీ స్పీకర్ పెద్దలు శ్రీపాద రావు మంథని ప్రాంతాభివృద్ధికి చేసిన సేవలు చిరస్మరణీయం. వారు మన మధ్య లేకపోయినా, వారి ఆశయాలకు అనుగుణంగా సేవా కార్యక్రమాలు నిర్వహించడం గొప్ప విషయం. ఈ క్రమంలో వారి పేరున చలివేంద్రం ఏర్పాటు చేయడం హర్షణీయం అని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమములో రామగిరి తాజా మాజీ ఎంపీపీ అరెల్లి దేవక్క కొమురయ్య 'కాంగ్రెస్ పార్టీ రామగిరి మండల అధ్యక్షులు రొద్ద బాపన్న మాజీ సర్పంచ్ దేవునూరి రజిత శ్రీనివాస్ - మాజీ ఉపసర్పంచ్ మొగిలి నరేష్ యాదవ్ గ్రామ శాఖ అధ్యక్షులు బావు రాజమల్లు ' కన్నూరి ఒదేలు 'కనూరి కరుణకర్ మాజీ వార్డు సభ్యుడు షిరియెట్టి అశోక్ గ్రామ కాంగ్రెస్ పార్టీ యూత్ అధ్యక్షులు దేవునూరి రాజేష్ . కన్నూరి హరీష్ ఎంజాల స్వామి రామగిరి మండలం కాంగ్రెస్ పార్టీ మహిళా ఉపాధ్యక్షురాలు జాగారి రజిత గ్రామప్రజలు అధికసంఖ్యలో పాల్గొన్నారు

# తెలంగాణ రాష్ట్ర సేనతో

# ప్రజలకు అమ్మనై పాలన అందిస్త

- కర్కోటక నియంత ప్రభుత్వాన్ని తరిమేసేందుకు పాంచజన్యం పూరిస్తున్న
- కేసీఆర్ ఆత్మలేని మరబొమ్మ.. ఆయన గుంటనక్కలు, తోడేళ్ల చేతిలో బంది అయ్యాడు
- మునీరాబాద్ వేదికగా టీఆర్ఎస్ పార్టీని ప్రకటించిన కల్వకుంట్ల కవిత
- పసుపు, నీలం, ఆకుపచ్చ రంగుల్లో పార్టీ జెండా
- ఉచిత విద్య, ఉచిత వైద్యం, వ్యవసాయం, ఉపాధి, సామాజిక న్యాయం ఇరుసుగా మా పార్టీ పని చేస్తుంది
- తెలంగాణకు అన్యాయం జరుగుతున్న బీజేపీ బానిస ఎంపీలు మాట్లాడ్తలేరు



తెలంగాణకు ఏమైనా జరిగితే ప్రాణం పెట్టి పనిచేసే పార్టీ కావాలి అందుకే తెలంగాణ రాష్ట్ర సేన పార్టీతో మీ ముందుకు వస్తున్నాం తెలంగాణ రాష్ట్ర సేన అధినాయకురాలు కల్వకుంట్ల కవిత

మేడ్చల్( ప్రశ్న న్యూస్ ) అమ్మనై తెలంగాణ ప్రజలకు పరిపాలన అందిస్తానని కల్వకుంట్ల కవిత ప్రకటించారు. మేడ్చల్ మండలంలోని మునీరాబాద్ గ్రామంలో గల ప్రొఫెసర్ జయశంకర్ ప్రాంగణం (అద్వయ కన్వెన్షన్)లో శనివారం ఉదయం తెలంగాణ రాష్ట్ర సేన (టీఆర్ఎస్) పార్టీని ప్రకటించారు. ఈ సందర్భంగా కల్వకుంట్ల కవిత మాట్లాడుతూ ఉచిత విద్య, ఉచిత వైద్యం, వ్యవసాయం, ఉపాధి, సామాజిక న్యాయం అనే పంచ సూత్రాలే లక్ష్యంగా తమ పార్టీ పని చేస్తుందన్నారు. రాష్ట్రంలో ఇప్పుడు ప్రధాన ప్రతిపక్షంగా ఈ ఐదు రంగాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై ఉద్యమిస్తామని, రెండున్నరేళ్ల తర్వాత అధికారంలోకి వచ్చి ఆయా సమస్యలకు పరిష్కారం చూపిస్తానని తెలిపారు. ఉద్యమకాలంలో ప్రజల కోసం పరితపించిన కేసీఆర్ ఇప్పుడు గుంటనక్కలు, తోడేళ్ల చేతిలో బంది అయ్యారని.. ఆయన మన కేసీఆర్ కాదు మరబొమ్మ అన్నారు. తెలంగాణాకు ఏదైనా జరిగితే ప్రాణం పెట్టి పని చేసే పార్టీ కావాలని అందుకోసమే తాను టీఆర్ఎస్( తెలంగాణ రాష్ట్ర సేన) పార్టీని ఏర్పాటు చేస్తున్నానని తెలిపారు.

### రేవంత్ రెడ్డి కర్కోటకుడు.. నియంత :

రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి...కర్కోటక, నియంత సీఎం అని మండిపడ్డారు. వెలుగుమట్లలో అన్ని పర్మిషన్లు ఉన్న సరే అక్కడి ప్రజల ఇళ్లను కూల్చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆ బాధతో ఒక గర్భిణీకి అబార్షన్ అయితే ఆమె తండ్రి రోదన కళ్ల ముందు ఇంకా మెదులుతుందని చెప్పారు. రెండు నెలల చిన్నారిని కాళ్లతో తన్ని చంపితే ఇప్పటికీ కూడా కేసు పెట్టలేదన్నారు. గురుకులాల్లో విషం పెట్టి విద్యార్థులను చంపుతుంటే ఈ ప్రభుత్వం స్పందించటం లేదని విమర్శించారు. కర్ల రాజేష్ అనే యువకుడిని లాకప్ డెత్ చేస్తే ఇప్పటికీ కూడా చర్యలు తీసుకోలేదన్నారు. అందుకే ఈ ముఖ్యమంత్రిని కర్కోటక, నియంత ముఖ్యమంత్రి అంటున్నానని చెప్పారు. రాష్ట్రంలో ఇప్పుడున్న మూడు పార్టీలు కుటుంబ పాలన, అవినీతి, బంధుప్రీతితో నిండిపోయాయని చెప్పారు. రాహుల్ గాంధీని ప్రధాని చేయటం కాంగ్రెస్ అజెండా అయితే పెద్ద సార్ ఫామ్ హౌస్ లో ఉండి...చిన్న సార్ ను సీఎం చేయాలన్నది బీఆర్ఎస్ అజెండా అని అన్నారు. ఇక సామాజిక న్యాయాన్ని ఖతం పట్టించటమే బీజేపీ సింగిల్ అజెండా అని కవిత అన్నారు. ఈ మూడు పార్టీల మీద అలుపెరగని పోరాటం చేసేందుకు తెలంగాణ రాష్ట్ర సేన సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు.

### అమ్మగా పరిపాలన అందిస్తా :

తెలంగాణలో 3.50 కోట్ల మంది ప్రజలకు అమ్మనై పరిపాలన అందిస్తానని కవిత చెప్పారు. అమ్మతనంతో పాలన చేస్తేనే బిడ్డల కష్టం తెలుస్తుందన్నారు. తెలంగాణలో ఏళ్ల తరబడి నడిచిన భూస్వామ్య వ్యవస్థపై ఎందరో మహానుభవులు పోరాడితేనే సమానత్వం వచ్చిందన్నారు. మలిదశలో కేసీఆర్, ఉద్యమకారులు పోరాడితే కొత్త రాష్ట్రం వచ్చిందన్నారు. ఇప్పుడు తాము రాజకీయ శక్తితో పాటు ప్రజా పోరాటాలను మిళితం చేసి సామాజిక తెలంగాణ సాధిస్తామని చెప్పారు. తల్లి జేబు చూడదని, కడుపు చూస్తుందని కవిత చెప్పారు. కచ్చితంగా రాష్ట్రంలో ప్రధాన ప్రతిపక్షంగా తామే ఉంటామని... మరో రెండేళ్లలో అధికారంలోకి వస్తామని ధీమా వ్యక్తం చేశారు.

### పాంచజన్యం పేరుతో ఐదు హామీలు :

తెలంగాణ రాష్ట్ర సేన అజెండాను కవిత వివరించారు. పాంచజన్యం పేరుతో ఐదు అంశాలపై హామీ ఇచ్చారు. ముఖ్యంగా ఉచిత విద్య, ఉచిత వైద్యం, రైతు సంక్షేమం, ఉపాధి, సామాజిక న్యాయం అనే అంశాలపై దృష్టి పెడతామని ప్రకటించారు. కేజీ నుంచి పీజీ వరకు ప్రైవేట్, కార్పొరేట్ స్కూళ్లలో చదివిన కూడా ప్రజలపై రూపాయి భారం పడనివ్వమని చెప్పారు. ఎంత పెద్ద ఆరోగ్య సమస్యకైనా కార్పొరేట్ వైద్యం చేయించుకున్న సరే ప్రజలకు ఆ వైద్యాన్ని ఉచితంగానే అందించే బాధ్యత తనదని కవిత స్పష్టం చేశారు. ఇక రైతు సంక్షేమం అంటే రైతుకు గౌరవం వచ్చేలా కృషి చేయటమేనన్నారు. తాము రైతులమని గర్వంగా చెప్పుకునేలా చేస్తామన్నారు. 24 గంటల ఉచిత కరెంట్, యూరియ సహా రైతు సంక్షేమానికి చేయాల్సివన్నీ చేస్తామని స్పష్టం చేశారు. రైతును రాజు చేయటమే లక్ష్యమన్నారు. ఇక ఉపాధి విషయంలోనూ తమకు స్పష్టమైన విజన్ ఉందని కవిత చెప్పారు. యువతకు ఉపాధి అంటే కేవలం ఉద్యోగం మాత్రమే కాదన్నారు. వారి వద్ద మంచి వ్యాపార ఆలోచన ఉంటే రూ.2 లక్షల నుంచి రూ.20 కోట్ల వరకు ప్రభుత్వమే రుణం అందించి వారిని ప్రోత్సహిస్తుందని స్పష్టం చేశారు. అదే విధంగా తాము అధికారంలోకి వచ్చిన మొదటి ఏడాదిలోనే ఒకటే నోటిఫికేషన్ లో 4 లక్షల ఉద్యోగాలు ఇస్తామని స్పష్టం చేశారు. తెలంగాణ ఉద్యమకారులు తమ యవ్వనాన్ని ఉద్యమంలో కోల్పోయారని చెప్పారు. వారి కోసం జూన్ 2, 2014 ను కటాఫ్ తేదీగా నిర్ణయిస్తూ లక్ష సూపర్ న్యూమరీ ఉద్యోగాలు కల్పిస్తామన్నారు. ఇక సామాజిక న్యాయం కోసం చిత్తశుద్ధితో పనిచేస్తామన్నారు.

### కేసీఆర్ పాలనలో దారి తప్పిన తెలంగాణ రథ చక్రం :

తెలంగాణ సాధించుకున్న తర్వాత కేసీఆర్ ఆధ్వర్యంలో తెలంగాణ రథ చక్రం దారి తప్పిందని కవిత అన్నారు. తెలంగాణ ప్రజల ఆశలు, ఆర్తిని అర్థం చేసుకోవటంలో బీఆర్ఎస్ పూర్తిగా విఫలమైందన్నారు. సామాజిక తెలంగాణ రథచక్రం పూర్తిగా విరిగి ముక్కలైందని ఆవేదన వ్యక్తం చేశారు. ఏ కలలతో తెలంగాణ తెచ్చుకున్నామో అవి నిజం కాలేదన్నారు. తెలంగాణ వస్తే బానిస సంకెళ్లు పోతాయని భావిస్తే...రైతులకు బేడీలు వేశారన్నారు. ఇసుక దందా మీద ప్రేమతో దళితుల మీద లాఠీలు విరిగాయని గుర్తు చేశారు. ఫోన్లు ఎక్కడ వింటారోనని వ్యక్తిగత స్వేచ్ఛ లేకుండా బతకాల్సి వచ్చిందని...దారుణమైన నిఘా నీడలో తెలంగాణ అంతా బతికిందని చెప్పారు. ఆనాడు తెలంగాణ కోసం ఆస్తులు అమ్ముకున్న వాళ్లంతా ఇప్పుడు ఎక్కడ ఉన్నారని ప్రశ్నించారు. ఉద్యమకారులు, అమరవీరుల కుటుంబాలకు అన్యాయం జరిగిందన్నారు. ఉద్యమకారులు ఒక హోదా మాత్రమే కోరుకున్నారని...పదేళ్లు అధికారంలో ఉండి కనీసం వారికి నామినేటేడ్ పోస్టులు కూడా ఇవ్వలేదని కవిత చెప్పారు. ఉద్యమంలో మనల్ని అవహేళన చేసి లాఠీలతో కొట్టించిన వారే మళ్లీ బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చాక పెత్తనం చెలాయించారన్నారు.

### ఆత్మలేని మరబొమ్మ, మారిన మనిషి కేసీఆర్ :

తన తండ్రి కేసీఆర్ మీద కవిత తీవ్రమైన ఆరోపణలు చేశారు. ఆనాటి కేసీఆర్, నేటి కేసీఆర్ వేరని చెప్పారు. ఆ నాటి కేసీఆర్ చేనేత కార్మికులు చనిపోతే బిక్షాటన చేసి సాయం చేశారని గుర్తు చేశారు. కానీ మారిన, మర మనిషి కేసీఆర్ ఇప్పుడు ప్రజలు కష్టాల్లో ఉన్న బయటకు రావటం లేదన్నారు. వెలుగుమట్లలో, హైడ్రా పేరుతో ఇళ్లు కూల్చేస్తుంటే అయ్యా కేసీఆర్ అని ప్రజలు పిలుస్తుంటే కూడా సార్ బయటకు రావటం లేదన్నారు. ఎక్కడ ఎవరికీ చిన్న కష్టం వచ్చిన ఆ సార్ బయటకు రారు. ఎందుకంటే ఆయన ఆత్మలేని మర బొమ్మ అంటూ కవిత తీవ్ర పదజాలం వాడారు. ఆనాడు సింగరేణిలో కార్మికుడు చనిపోతే వెళ్లి పరామర్శించిన ఆయన...

నేడు చేవెళ్లలో బస్సు ప్రమాదంలో చాలా మంది చనిపోయిన సరే పట్టించుకోలేదని విమర్శించారు. అధికారం వచ్చిన తర్వాత ప్రేమ, మమకారం పోయిందా అంటూ ప్రశ్నించారు. అవినీతి చేస్తే కొడుకునైనా, కూతురినైనా సరే వదలనని కేసీఆర్ గతంలో చెప్పారని కవిత గుర్తు చేశారు. కానీ తాను కాళేశ్వరంలో అవినీతి జరుగుతుందని చెబితే ఆ అవినీతి చేసిన పందికొక్కులను పక్కన పెట్టుకొని తననే పార్టీ నుంచి సస్పెండ్ చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. గుంటనక్కలు, తోడేళ్ల చేతుల్లో కేసీఆర్ బందీ అయ్యారన్నారు.

ఆర్డీఎస్ ద్వారా నీళ్ల కోసం ఆనాడు పాదయాత్ర చేసిన కేసీఆర్ అధికారంలోకి వచ్చిన తర్వాత దాన్ని ఎందుకు పట్టించుకోలేదని ప్రశ్నించారు. కేంద్రంతో గొడవ పెట్టుకోకపోయింటే పాలమూరు-రంగారెడ్డి పూర్తయ్యేదన్నారు. బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన పదేళ్లలో నీళ్ల కోసం లక్షా 89 వేల కోట్లు ఖర్చు చేసి 14 లక్షల ఎకరాలకు మాత్రమే నీళ్లిచ్చారని చెప్పారు. రాష్ట్రంలో ఏదో పీకి కట్టలు కట్టారని పంజాబ్, గుజరాత్, బీహార్ వెళ్లి జాతీయ పార్టీ పెట్టాలని చూశారని విమర్శించారు. పైగా ప్రజలే తప్పు చేశారన్నట్లుగా కేసీఆర్ గారు రాజకీయ పరిణితి కోల్పోయి మాట్లాడుతున్నారని కవిత అన్నారు. తాను ఎన్ని మాట్లాడిన సరే బీఆర్ఎస్ నేతలకు సమాధానం చెప్పటం చేతకావటం లేదన్నారు. ఇప్పుడు కూడా సమాధానం చెప్పకపోతే ప్రజలే బయకు లాగి సమాధానం చెప్పేలా చేస్తారన్నారు.

# దాడులు చేసిన మళ్లీ రేషన్ బియ్యం దందా

- సిద్ధిపేట జిల్లాలో రెచ్చిపోతున్న రేషన్ బియ్యం మాఫియా
- అధికారులు దాడులు చేసిన డోంట్ కేర్ అంటున్న మాఫియా నేతలు
- దాదాపు 500 కింటల రేషన్ బియ్యం స్వాధీనం
- కొంతమంది అధికారుల కనుసైగల్లోనే అక్రమ రేషన్ బియ్యం దందా
- దాడులు జరుగుతాయని మాఫియాకు ముందుగానే సమాచారం ఇస్తున్న కొంతమంది అవినీతి అధికారులు




హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ రాష్ట్రంలో పేదల కోసం ప్రభుత్వామిస్తున్న రేషన్ బియ్యం ఇప్పుడు అక్రమార్కులకు ధర సంపదగా మారింది దీనిపై "ప్రజాప్రశ్నలి దినపత్రికలో వస్తున్న వరుస కథనాలతో విజిలెన్స్, ఎంఫోర్స్మెంట్ టాస్క్ ఫోర్స్ (సివిల్ సప్లై) అధికారులు వరుస దాడులు చేయడంతో క్వింటాళ్లకొద్దీ



బియ్యం దొరకడం ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది.( టీం లు 5 ఉన్న కేవలం టీం 2 అధికారులే అవినీతి అక్రమాలపై ఉక్కు పాదం మోపుతూ నిత్యం దాడులు చేయడం చూస్తుంటే మిగతా టీం ల అధికారులు ఎందుకు మౌనం వహిస్తున్నారు, అందులో అంతర్యం ఏమిటో అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. 5



టీముల అధికారులు తెలంగాణ వ్యాప్తంగా అక్రమ రేషన్ బియ్యం వ్యాపారం నిర్వహించే గోదాములు రైస్ మిల్లులపై దాడులు చేస్తే ప్రభుత్వానికి కోట్లలో లాభం ఉంటుందని, పేదవాడి బియ్యానికి రక్షణ ఏర్పడుతుందని తెలిసి కూడా దాడులు చేయకపోవడం ఎందుకో) సిద్ధిపేట జిల్లాలో అక్రమ రేషన్ బియ్యం దందా మరింత పెరుగుతూ అధికార యంత్రాంగానికే సవాల్‌గా మారుతోంది. రాయపోలు మండలంలోని రామారం గ్రామం కేంద్రంగా ఈ అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతుండగా, దాన్ని అడ్డుకునేందుకు టాస్క్‌ఫోర్స్, విజిలెన్స్ అధికారులు తరచూ దాడులు నిర్వహిస్తున్నప్పటికీ పరిస్థితిలో మాత్రం పెద్ద మార్పు



కనిపించడం లేదు. తాజాగా అందిన పక్కా సమాచారంతో అధికారులు భారీ స్థాయిలో దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో శ్రీ సాయి మహదేవ రైస్ ఇండస్ట్రీస్ పేరుతో రత్నాకర్ యజమాని నిర్వహిస్తున్న గోదాంలో దాదాపు 500 క్వింటాళ్ల



రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. విజిలెన్స్ ఇన్ఫోసిమెంట్ టాస్క్‌ఫోర్స్(టీం 2) డీఎస్పీ వెంకటేశం ఆధ్వర్యంలో జరిగిన ఈ ఆపరేషన్‌లో అక్రమంగా నిల్వ చేసిన బియ్యం గోదాములను గుర్తించి సీజ్ చేశారు. అయితే గతంలో కూడా ఇదే నిర్వాహకుడు రత్నాకర్ నిర్వహిస్తున్న గోదాంలో ఇలానే భారీగా బియ్యం పట్టుబడినా, ఈ దందాకు ప్రధాన కారకుడు రత్నాకర్ వ్యవహారంలో ఎలాంటి మార్పు కనిపించకపోవడం గమనార్హం. రత్నాకర్‌పై గతంలో కూడా కేసులు నమోదైనప్పటికీ, అవి అతనిని నిలువరించలేకపోయినట్టు స్థానికులు పేర్కొంటున్నారు. తెలంగాణ వ్యాప్తంగా కేసులు పెరుగుతున్నా, రేషన్ బియ్యం మాఫియా నిర్వాహకులు మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ తమ అక్రమ కార్యకలాపాలను యదేచ్ఛగా కొనసాగిస్తున్నారు. ఇంత దర్జాగా అక్రమ దందాలు జరగడం వెనక ప్రభుత్వ శాఖలలో లోపాలున్నాయా.? లేక కొంతమంది అధికారులు మాఫియాతో చేతులు కలిపి పట్టించుకోవడం లేదు, అనే అనుమానాలకు తావిస్తోంది. దాడుల సమయంలో అక్కడికి జిల్లా సివిల్ సప్లై అధికారిణి(డిసీ ఎస్‌ఓ) తనుజ రాకపోవడం పై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. గోదాముల్లో గోనె సంచులు పెద్ద ఎత్తున కనిపించినప్పటికీ, డిస్టిక్ మేనేజర్(డి ఎం) గోపికృష్ణ సైతం రాకపోవడం డిసిఎస్‌ఓ స్పందించకపోవడం మరిన్ని ప్రశ్నలను లేవనెత్తుతోంది. అధికారుల కనుసైగల్లోనే ఈ వ్యవహారం జరుగుతోందా.?

కొంతమంది అధికారుల నిర్లక్ష్యమా.? లేక మాఫియాకు సహకారం ఉందా.? అనే కోణంలో విచారణ జరగాల్సిన అవసరం ఉందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. ఇక స్థానిక పోలీస్ స్టేషన్ పరిధిలోనే ఈ అక్రమ రవాణా


ప్రజాప్రశ్న
తెలుగు దినపత్రిక
సీజ్ చేసిన రేషన్ బియ్యం ప్రభుత్వ గోదాంలోకే వెళ్తున్నాయా.?

సాగుతుండటం కూడా ఆశ్చర్యానికి గురిచేస్తోంది. పోలీసులకు సమాచారం లేకపోవడం సాధ్యమా.? లేక తెలిసినా చర్యలు తీసుకోవడంలో అంతర్యమేమిటో.? అక్రమ రేషన్ బియ్యం గోదాములపై దాడులు జరుగుతాయని ముందస్తు సమాచారం కొంతమంది పోలీసు అధికారులు, సివిల్ సప్లై అధికారులు నిర్వాహకులకు ముందుగానే ఇస్తున్నారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో సిద్ధిపేట జిల్లా కలెక్టర్, పోలీస్ కమిషనర్ తక్షణమే జోక్యం చేసుకుని కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ముఖ్యంగా పునరావృతంగా ఈ నేరాల్లో పాల్గొంటున్న వారిపై పీడీ యాక్ట్ నమోదు చేయాలని అధికార వర్గాల నుంచే సూచనలు వినిపిస్తున్నాయి. మొత్తానికి, సిద్ధిపేట జిల్లాలో అక్రమ రేషన్ బియ్యం దందా ఏ మాత్రం ఆగకపోవడం, కొంతమంది అధికారులు సహకరించడం దానికి కారణమైన వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోకపోవడం ప్రజల్లో ఆగ్రహాన్ని రేకెత్తిస్తోంది. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి, ఈ మాఫియాపై కఠినంగా వ్యవహరించకపోతే, కాంగ్రెస్ ప్రభుత్వానికి నష్టం వాటిల్లడంతో పాటు, పేదల ఆహార హక్కులు కూడా దెబ్బతింటాయనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఈ దాడులలో సివిల్ సప్లై విజిలెన్స్ సిఐ పాండరి, ఎస్సై సాంబశివరావు, ఏసిఎస్‌ఓ సాయి రవి, డిప్యూటీ తాసిల్దార్ రాజిరెడ్డి, అధికారి నాగరాజు, టెక్నికల్ అసిస్టెంట్ సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

# డిజిటల్ వ్యాలెట్లపై ఆర్‌బీఐ కొత్త రూల్స్

**- కాస్తంత కఠినమే**




న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) దేశంలో డిజిటల్ చెల్లింపులను మరింత సురక్షితంగా, పారదర్శకంగా మార్చేందుకు భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) కీలక చర్యలు చేపట్టింది. ప్రీపెయిడ్ పేమెంట్ ఇన్‌స్ట్రుమెంట్స్ (పీపీఐ) అయిన డిజిటల్ వ్యాలెట్లు, ప్రీపెయిడ్ కార్డులకు సంబంధించి కొత్త ముసాయిదా మార్గదర్శకాలను విడుదల చేసింది. వినియోగదారుల రక్షణ, నిర్వహణలో స్పష్టత పెంచడమే ఈ ప్రతిపాదనల ముఖ్య ఉద్దేశం. ఈ ముసాయిదా ప్రకారం, నాన్-బ్యాంక్ సంస్థలు పీపీఐ సేవలు అందించాలంటే కనీసం రూ. 5 కోట్ల నికర విలువ కలిగి ఉండాలి. కార్యకలాపాలు ప్రారంభించిన మూడేళ్లలోగా ఈ విలువను రూ. 15 కోట్లకు పెంచుకోవాలి. అలాగే, వినియోగదారుల నుంచి సేకరించిన నిధులను వాణిజ్య బ్యాంకులోని ప్రత్యేక ఎస్క్రో ఖాతాలో జమ చేయడాన్ని తప్పనిసరి చేశారు. డెబిట్ కార్డులు జారీ చేసే బ్యాంకులు కూడా ఆర్‌బీఐకి సమాచారం ఇచ్చి పీపీఐ సేవలు అందించవచ్చని ప్రతిపాదించారు. లావాదేవీల పరిమితులపై కూడా డ్రాఫ్ట్‌లో స్పష్టత ఇచ్చారు. సాధారణ పీపీఐలలో గరిష్ఠంగా రూ. 2 లక్షల వరకు బ్యాలెన్స్ ఉంచుకోవచ్చు. నెలకు రూ. 10,000 వరకు నగదు లోడ్ చేసుకోవడానికి అనుమతిస్తారు. చిన్న మొత్తాల పీపీఐల గరిష్ఠ పరిమితిని రూ. 10,000గా, ట్రాన్సిట్ కార్డుల పరిమితిని రూ. 3,000గా నిర్ణయించారు. వినియోగదారుల ప్రయోజనాలే లక్ష్యంగా, అన్ని ఛార్జీలు, నిబంధనలు, వ్యాలిడిటీ వివరాలను ఇంగ్లీష్, హిందీతో పాటు స్థానిక భాషలో స్పష్టంగా తెలియజేయాలని ఆర్‌బీఐ ఆదేశించింది. విఫలమైన, రద్దయిన లావాదేవీలకు సంబంధించిన డబ్బును తక్షణమే వినియోగదారుడి వ్యాలెట్‌కు రిఫండ్ చేయాలని పేర్కొంది. ఈ ముసాయిదాపై మే 22లోగా ప్రజలు, భాగస్వామ్య పక్షాలు తమ అభిప్రాయాలను తెలపాలని ఆర్‌బీఐ కోరింది.

# కేజ్రీవాల్ విధానాల కారణంగానే బయటకు వచ్చాం

**- ఆప్ ప్రస్తుతం సరైన మార్గంలో వెళ్లడం లేదని వ్యాఖ్య**



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) తనతో సహా ఏడుగురు ఎంపీలు భయంతో ఆమ్ ఆద్మీ పార్టీని వీడలేదని, కేజ్రీవాల్ విధానాల కారణంగా బలవంతంగా బయటకు రావాల్సి వచ్చిందని బీజేపీలో చేరిన రాఘవ్ చద్దా అన్నారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, ఆమ్ ఆద్మీ పార్టీ ప్రస్తుతం సరైన మార్గంలో వెళ్లడం లేదని విమర్శించారు. పార్టీ కోసం నిత్యం కష్టపడిన నాయకులు, కార్యకర్తలు ఆ పార్టీని వీడాల్సి వస్తోందని వ్యాఖ్యానించారు. మరికొందరు నాయకులు కూడా పార్టీని వీడే ఆలోచనలో ఉన్నట్లు తెలిపారు. ప్రస్తుతం ఆమ్ ఆద్మీ పార్టీలో ఉండటానికి చాలామందికి ఇష్టం లేదని అన్నారు. నిరాశ, నిస్పృహ, అసహ్యం వల్లే బయటకు వచ్చామని అన్నారు. అద్దాల మేడ కారణంగా ఆమ్ ఆద్మీ పార్టీ ప్రతిష్ఠ దెబ్బతిన్నదని అన్నారు. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ ఓటమికి ప్రధాన కారణం అదేనని తెలిపారు. అవినీతిపరులు, రాజీపడని వారి చేతుల్లోకి పార్టీ వెళ్లిపోయిందని ఆరోపించారు. కష్టపడి పనిచేసేవారికి పార్టీలో అవకాశాలు లేకుండా పోయాయని వాపోయారు.

# మార్కెట్‌లో "టెన్షన్ టెన్షన్" "39" లైసెన్స్‌లతో "సోమ" వార్ం

- గత వారం అసలైన లైసెన్స్ దారులు కొంతమంది హాజరు. మిగత వాళ్ళు సిఫార్సుతో రాక.?
- ఛైర్మన్,సెక్రటరీ మనస్సులో ఏం ఉంది ? అసలు నకిలీల వడపోత సాధ్యమేనా.? చర్యలు తీసుకుంటే మిగిలేది "18" లైసెన్స్ లేనా.?
- నకిలీ తెలుతే తక్ పట్టి స్వాధీనం తప్పదా.కొన్నప్రబుద్ధుల సంగతేంటి,ఆశలు
- వదులుకోవడమేనా ? అసోసియేషన్ ఏ విధంగా స్పందిస్తుందో వెచిచూడాల్సిందేనా.?
- ముసపేట్ లైన్ లో కమీషన్ ఏజెంట్ల పై ఇసుమంత సమాచారం లేని అసోసియేషన్ అధ్యక్షుడు.?
- పదేళ్లలో పాపం పెరిగితే, పదిహేను రోజుల్లో అధికారులు ప్రక్షాళన చేయడం విశేషం.







కంటోన్మెంట్ (ప్రశ్న న్యూస్) డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ కూరగాయల మార్కెట్ లో రేపు (సోమవారం)"39"మంది లైసెన్స్ దారుల జరగబోయే సమావేశానికి ఎంత మంది అసలైన లైసెన్స్ దారులు హాజరౌతారో వెచిచూడాల్సిందే.ఇప్పటికే జరగాల్సిన మీటింగ్ రెండు సార్లు వాయిదాలు పడుతూ వస్తున్న విషయం అందరికి తెలిసిందే! అయితే విశ్వసనీయ సమాచారం మేరకు ఒకరిద్దరు ఆరోగ్య సమస్య కారణంతో పాటు పలు కారణాల వల్ల మార్కెట్ అధికారులకు లేఖలు అందజేశారు. మూడో సోమ వారం ఎవరి పై శివుడి ఆశీస్సులు ఉంటాయో చూడాల్సిందే.అసలు, ఎవరు నకిలీ అని తెలుస్తోందో, జరగబోయే సమావేశం దేనికి దారి తీస్తుందోనని ఉత్కంఠగా బోయిన్ పల్లి మార్కెట్ లో వేచి చూస్తున్న కమీషన్ ఏజెంట్లు.కాంగ్రేస్ హయాంలో జారీ చేసిన 39 (42) లైసెన్స్.అప్పటి నుంచి బోయిన్ పల్లి మార్కెట్ లో వివాదాస్పదంగా మారాయి. 2015 నుంచి 2023 వరకు ముసపేట్ లైన్లో లెక్కకు మించిన అవకతవకలు జరిగాయి,మరీ ముఖ్యంగా ఎవ్వరు మర్చిపోలేని విధంగా కొందరైతే ఏకంగా చనిపోయిన "సమాధుల"ను సైతం ఆనవాళ్లు లేకుండా మాయ చేసిన మాయగాళ్లు,మరి కొందరు అయితే నీటి ఎద్దడిని దృష్టిలో పెట్టుకొని మార్కెట్ అధికారులు మంచి నీటి ట్యాంకును ఏర్పాటు చేస్తే చూట్టు ఉన్న కంచెను(ఫినిషింగ్) రాత్రికి రాత్రే తొలగించి ఏకంగా మార్కెటింగ్ డిపార్ట్మెంట్ అధికారులు జారీ చేసిన లైసెన్స్ లు లేకపోయినా వ్యాపార లావాదేవీలు నిర్వహిస్తున్నారంటే వీరి వెనుక ఉన్న ఆ అస్మదీయులు ఎవరో నిగ్గు తేల్చే పనిలో పడ్డారు మార్కెట్ అధికారులు. ఇలా ఒకటి కాదు రెండు కాదు చాంతాడంత లిస్టు "39" మంది లైసెన్స్ దారులు లీలలు.? ఆశ్చర్యపోయే విషయం ఏమిటంటే వీరే వ్యాపారానికి




అర్హులు కాదు, వీళ్ళు ఇద్దరికీ,ముగ్గురికి కిరాయి ఇస్తూ కాసులు వెనుకేసుకుంటున్నారు.

### "42"మంది కమీషన్ ఏజెంట్లు వ్యవసాయ చట్టంతో సాహసం:

వ్యవసాయ మార్కెటింగ్ డిపార్ట్మెంట్ అధికారులు 2013 లో ముఖేష్ గౌడ్ మంత్రి చేతులు మీదుగా సుమారు "42"కొత్త లైసెన్స్ లు జారీ చేసినట్లు సమాచారం.ఈ వ్యవహారం పై సికింద్రాబాద్ వెజిటబుల్ కమీషన్ ఏజెంట్ల అసోసియేషన్ అధ్యక్షుడు సోమ దేవేందర్ రెడ్డి తో పాటు పలువురు కమీషన్ ఏజెంట్లు ధర్నా నిర్వహించారు. నూతనంగా జారీ చేసిన లైసెన్స్




లు రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ నిరసనలు వెల్లువెత్తాయి. తొమ్మిది రోజుల పాటు జరిగిన ధర్న చివరికి అధికారుల జోక్యంతో ట్రెడర్స్ ధర్నా విరమించారు. అనంతరం మార్కెటింగ్ డిపార్ట్మెంట్ అధికారులు "42"లైసెన్స్ దారులకు కొన్ని నియమ నిబంధనలతో కూడిన నివేదిక బోయిన్ పల్లి మార్కెట్ అధికారులకు పంపారు. అదేమిటంటే "94" మంది కమీషన్ ఏజెంట్లకు దేశంలో ఎక్కడా లేని విధంగా "ఓనర్ షిప్" వెసులుబాటు కల్పించారు.అలాగే పార్టనర్ షిప్ "(1932 పార్టనర్ షిప్ యాక్ట్) వెసులుబాటు ఉండడం విశేషం.అయితే "42"కమీషన్ ఏజెంట్లు సైతం మాకు "94"మంది కమీషన్ ఏజెంట్లకు ఏవిధమైన సౌకర్యాలు కల్పించారో అదే విధంగా మాకు వర్తించే విధంగా అధికారులు చొరవ తీసుకొవాలని విజ్ఞప్తి చేస్తే, మార్కెటింగ్ డిపార్ట్మెంట్ అధికారులు నో ఛాన్స్ అని తేల్చి చెప్పేశారు.చేసేది ఏమి లేక ఉన్నది ఒకటే దారి అంటూ "న్యాయస్థానం ".అప్పటి నుంచి ఇప్పటి వరకు న్యాయం జరగపోగ,కొందరు లైసెన్స్ లు విక్రయిస్తూ, మరికొందరు తామే స్వయంగా వ్యాపారం చేస్తూ మార్కెట్ లో ఉన్నారు. అసలు విషయం తెలియని కొందరు సోల్ట్ ప్రొపర్టర్ విధానంలో క్రయవిక్రయాలకు తావు లేకుండా చట్టం చేసిన మార్కెటింగ్ డిపార్ట్మెంట్ అధికారులను బురిడీ కొట్టిస్తూ,లక్షలు,కోట్లు సొంతం చేసుకుంటున్నారు.డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ కూరగాయల మార్కెట్ లో గత కొంత కాలంగా జరుగుతున్న వ్యవహారాన్ని పసిగట్టిన పాలకమండలి ఛైర్మన్ రాగిరి ఆనంద్ బాబు,సెక్రటరీ ఈ.వెంకటేశం సమావేశం అయ్యి,వీలైనంత త్వరగా వీటిని అరికట్టడానికి (కార్యాచరణ) ప్రణాళికలు సిద్ధం చేయాలని ఛైర్మన్ సూచించారు.అయితే గత పదిహేను రోజుల క్రితం మార్కెట్ సిబ్బంది "39"లైసెన్స్ దారులకు సమావేశం ఏర్పాటు చేశాం తప్పక రావాలి లేని పక్షంలో చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ నేపథ్యంలో కొందరు స్వచ్ఛందంగా వస్తే, మరికొందరు అసోసియేషన్ పెద్దల సహకారాలతో మీటింగ్ కి వచ్చారు.

### అసలు నకిలీ పై గురి:

బోయిన్ పల్లి మార్కెట్ లో "39"మంది కమీషన్ ఏజెంట్ల తో సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని కమిటీ నిర్ణయం తీసుకోవడంతో "కొనుగోలు దారులు,కిరాయి దారులు" గుండెల్లో రైళ్లు పరిగెత్తుతున్నాయి. వీటిని మార్కెట్ లో కొందరు ఆసరాగా చేసుకుని పైరవీలకు తేర లేపారు. దీనిలో ముఖ్యంగా ఆరి తేరిన వ్యక్తి కొంత ఖర్చుతో కూడుకున్న వ్యవహారం అంటూ(నీ సమస్యకు నేను జెండుబాంబు అవుతానంటూ పెద్ద పెద్ద డైలాగ్స్ తో రెచ్చిపోతున్నారు, భరోసా ఇస్తూ మార్కెట్ లో ప్రభంజనం సృష్టిస్తున్నాడు. ఇలాంటి వాళ్ల పైన ఓ కన్ను వేయాలని మార్కెట్ వర్గాలు కమిటీకి,అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు.

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.No : 8-2-293/82/10/80, Womens Co-operative Housing Society, Road No - 7, Jubilee Hills, Hyderabad - 500033, Telangana State. Printed at "Gowrish Offset Printers".
H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588